హనీబీఎపి
సంపుటి 5, సంచిక 1
జులై-ఆగస్టు 2010

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




## సన్న, మధ్యకారు రైతులకు వరం

# మస్తాన్‌వలి మినీ ట్రాక్టర్

## అంతర్జాతీయ గుర్తింపు పొందిన మన గ్రామీణ ఇన్నోవేటర్

# చింతకింది మల్లేశం

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

- 82 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిస్టర్ లో చేయడం జరిగింది.
- నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.
- ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- ఇప్పటి వరకు 16 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..
- తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.
- హైదరాబాద్‌లో జనవరి 2010 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో మన ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.
- వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.
- దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.
- ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.
- గత నాలుగేళ్లలో 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించింది.
- 42 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని 130 గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.
- చింతకింది మల్లేశం ఆసు మిషన్‌కు, నరసింహాచారి కాలిపోయిన ట్యూబ్‌లైట్లను వెలిగించే పరికరానికి ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.
- ఇష్వాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.
- చింతకింది మల్లేశం పరిశోధనకు గాను రాష్ట్రపతి ద్వారా ప్రథమ జాతీయ పురస్కారం.
- హైదరాబాద్‌లో జనవరిలో జరిగిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో పల్లెసృజన స్టాల్‌ను నిర్వహించగా అక్కడికి ఎంతోమంది సందర్శకులు స్టాల్‌కు విచ్చేయడం.
- 1 మార్చి, 2010న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్నోవేటర్లు, అధికారులు, అనధికారుల సమ్మేళనం అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడం.
- దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.
- కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు నల్లమల అడవులలోని మొక్కలతో చేసిన ప్రయోగాలు అద్భుత ఫలితాలు సాధించాయి. వీటివల్ల మనుషులకు, పశువులకు, పంటలకు ఎంతో లాభం చేకూరింది. ఈ అద్భుత లక్షణాలుగల మొక్కలను పరీక్షించటానికి హనీబీఏపి "సి.సి.ఎం.బి., హైదరాబాద్"తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పరిశోధనా సంస్థలకు, పల్లె జ్ఞానానికి ఇదొక వినూత్న సంధానం.
- ఫోర్బ్స్ పత్రిక చింతకింది మల్లేశానికి అంతర్జాతీయ గుర్తింపుగా భారతదేశంలో అతి శక్తిశాలురైన ఏడుగురు గ్రామీణ ఇన్నోవేటర్లలో ఒకరిగా ఎన్నుకుంది.

**మా కలలు :**

- ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.
- పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం
- 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో-ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-5 సంచిక - 1 జులై-ఆగస్టు 2010



## సంపాదకవర్గం

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**

**ప్రొ. అనిల్ గుప్త**

**డా. గీర్వాణి**

**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**

**జాగర్లమూడి దుర్గాప్రసాద్**

**శ్రీమతి అరుణ గణేశం**

**జె. శశిమోహన్**

**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :

**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**

ఫోన్ : 040- 27665655

సెల్ : 93913 75655, 800 888 5655

E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :

**పల్లెసృజన,** 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,

సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-27118555, 98660 01678

E-mail : honeybeeap@gmail.com


## ఈ సంచికలో......


- ✤ సన్న, మధ్యకారు రైతులకు వరం మస్తాన్‌వలి మినీ ట్రాక్టర్ -3
- ✤ అంతర్జాతీయ గుర్తింపు పొందిన మన గ్రామీణ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం -5
- ✤ జ్ఞానపెద్దమ్మ నూరేళ్ళ మద్దమ్మ -6
- ✤ సేవాతత్పరులకు 'సృష్టి' సన్మానం -9
- ✤ సహజ ఎరువులు- కషాయాలు - 11
- ✤ మోటార్ సైకిల్‌తో వినూత్న ప్రయోగం - దానితోనే వాటర్ సర్వీసింగ్ జడ్చర్లలో అనుమోలు శ్రీనివాస్ అద్భుత ఆలోచన -14
- ✤ మనమే కరెంటు ఉత్పత్తి చేద్దాం! -18
- ✤ ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు -19
- ✤ మన ఔషధ మొక్కలు -24
- ✤ సైకిల్ వాహకులకు శుభవార్త వెంకటేశ్వర్లు ఇన్నోవేషన్ "యాంత్రిక సైకిల్" -28
- ✤ ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి -32

**కవర్ లోపలి పేజీల్లో :**

**హనీబీ ఏపి ప్రగతి**

**ఇక కరెంటు 'షాక్' కొట్టదు తెలుసా?**

**మధ్యపేజీలో**

**చిన్నారుల చిలిపి జ్ఞానం**



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015. Gujarat, India.
Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
Dr. Balaram Sahu,
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
Dr. T.N. Prakash
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
P. Vivekanandan, 45,
TPM Nagar,
Virattipathu - 625 010.
Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
James T J,
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : **Brig. P. Ganesham,** VSM (Poorva Senani), on behalf of **"HoneyBeeAP"**
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.**Ph.: 040-27118555, Cell : 0 98660 01678.**
Printed at : **Narendra Grafix,** Chikkadpally, Hyderabad. **Ph. : 93913 75655**

# సంపాదకీయం

మీ 'పల్లెసృజన' అయిదవ సంవత్సరంలో అడుగుపెట్టింది. 2006 మేనెలలో ప్రారంభమైన "పల్లెసృజన" త్రైమాసిక పత్రికగా మీ ఆదరణాన్ని పొందింది. 16 సంచికలు వెలువడ్డాయి. ఎందరో గ్రామీణ ఇన్నోవేటర్లు, ఎంతో సాంప్రదాయ జ్ఞానము, హనీబీఎపి కార్యక్రమాలు, ఇన్నోవేషన్ల ప్రగతి, ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్లకు సత్కారాలు, ప్రొఫెసర్ గుప్తా గారి ఆలోచనా సరళి, శోధయాత్రలు, జ్ఞానశోధలు అన్నీ మీకు అందించగలిగాము.

ఈ "పల్లెసృజన" ఒక జ్ఞానపరమైన పత్రికగానే ఉండాలని శాయశక్తులా ప్రయత్నం చేశాం. అడ్వర్టైజ్‌మెంట్లుకాని, స్పాన్సర్‌షిప్ కాని లేకుండా నడపాలన్న మా ధ్యేయం ఇంతవరకు సాగింది. ఇలాగే భవిష్యత్తులో కూడా సాగిపోవాలని మనసారా ఆశిస్తున్నాము. ఇది ఇలాగే సాగాలంటే సభ్యత్వం పెరగాలి. మీరంతా మీ మిత్రులకు "పల్లెసృజన" సభ్యత్వం బహుమతిగా ఇస్తారని కోరుతున్నాం.

అయిదవ సంవత్సరం నుండి పాఠకులకు 'పల్లెసృజన' ప్రతి రెండు నెలలకే అందిద్దామని నిర్ణయించాం. ఈ సంచికనుండి "పల్లెసృజన" ద్వైమాసిక పత్రికగా మారింది. అదే చందాలో మీకు ఆరుపత్రికలు ఒక సంవత్సరంలో చేరుతాయి. అంతేకాకుండా 28 పేజీలనుంచి 32 పేజీలకు పెంచడం జరిగింది. ఇదంతా మీ ప్రేరణ వల్లనే జరుగుతోంది. ఇన్నోవేటర్ల గురించి వ్రాయడం, మీ చుట్టుప్రక్కల సాంప్రదాయ జ్ఞానం గురించి మాకు తెలపడం, మీ అభిప్రాయాలు, విమర్శలు, సలహాలు, స్పందనలు విరివిగా మాతో సంప్రదించడం జరిగితేనే ఈ 'ద్వైమాసిక పత్రిక' విజయవంతంగా ప్రచురితమై మీకు చేరుతుంది.

శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఎపితో సాంగత్యం 2007లో ప్రారంభించారు. ఆయన దక్షత, ఏకాగ్రత, స్వచ్ఛంద భావన హనీబీఎపి ప్రగతికి మూలకారణం. ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తీసుకురావడానికి ఆయన ఆధ్వర్యంలో "క్రియేటివ్ మైండ్స్" ప్రారంభమైంది. ఈ సంస్థ ద్వారా గ్రామీణ ఆవిష్కరణలు ఈ సంవత్సరంలో మార్కెట్‌లోకి రావడానికి చేసిన కృషి ఫలించింది. భవిష్యత్తులో మరిన్ని గ్రామీణ ఇన్నోవేషన్లు మార్కెట్‌లోకి తెచ్చి, ఇన్నోవేటర్లకు, సమాజానికి లాభం చేకూర్చడంలో "క్రియేటివ్ మైండ్స్" సఫలమవుతుందని, దానికి మీ సహకారం, ప్రోత్సాహం, శుభాకాంక్షలు ఎల్లప్పుడూ ఉంటాయని మనసారా ఆశిస్తున్నాం.

పిల్లల్లో సృజనాత్మకత ఎంతగానో ఉంటుంది. వారికి ఆలోచించే స్వేచ్ఛ, మాట్లాడే అవకాశం ఇస్తే అద్భుతమైన ఆలోచనలు, జ్ఞానపరమైన ప్రశ్నలు సమాజం ఆలోచించే సమస్యలను మనకు తెలుపుతారు. ఈ సంచికలో నెల్లూరుజిల్లా సీతారామపురం మండలంలోని పాఠశాల విద్యార్థుల ఆలోచనలను మీముందుంచాం. దీన్ని ముందు సంచికలలో ప్రచురించాలంటే, మీ పిల్లలను ప్రేరేపించి, వారి ఆలోచనలను మాకు పంపితే వాటిని ప్రచురిస్తాం. పిల్లల ఫొటో, చిరునామా, పాఠశాల చిరునామా తప్పకుండా పంపించండి.

ఈ దీపావళి మీ జీవితాల్లో కాంతిని ఎల్లప్పుడూ ప్రసాదించాలని, సమాజసేవలో మీరంతా మనస్ఫూర్తిగా పాల్గొనాలని ఆశిస్తూ......

**భవదీయ**
**'బ్రిగేడియర్' పి. గణేశం**



## సన్న, మధ్యకారు రైతులకు వరం

# మస్తాన్‌వలి మినీ ట్రాక్టర్

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తాడేగూడెం మండలం, పొన్నకల్లు గ్రామంలో నివసించే పుల్లాసాహెబ్, అల్లాబీల ఏకైక సంతానం “మస్తాన్ వలి”. ఇతను గ్రామంలోని పాఠశాలలో రెండవ తరగతి వరకు చదివి అంతటితో చదువు ఆపేసి సైకిల్ రిపేర్ షాపులో పనిచేయటం ప్రారంభించాడు. ఇలా పది సంవత్సరాలు పని చేసిన తర్వాత గుంటూరులోని ఒక లారీ వర్క్‌షాప్‌లో పనికి కుదిరాడు. అక్కడ ఆరు సంవత్సరాలు పని చేసిన తర్వాత గ్రామానికి వచ్చి తనే స్వంతంగా ఒక సైకిల్ షాపును ప్రారంభించి, దానిని నాలుగు సంవత్సరాలు సమర్థవంతంగా నడిపించాడు. ప్రస్తుతం అతను వ్యవసాయం చేయటం ప్రారంభించాడు. ఇతని ఇద్దరి అమ్మాయిలలో ఒకరు ఎం.సి.ఏ. పూర్తి చేయగా, ఇంకొకరు బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్నారు.

ప్రత్తి ప్రధాన పంటగా కల వ్యవసాయ గ్రామం పొన్నకల్లు. మస్తాన్‌వలి సైకిల్ షాపులో పని చేస్తూ ప్రత్తి పండించే వ్యవసాయదారుల అవసరాలను గమనించేవాడు. పత్తిపంటలో తరచూ కలుపు తీయటానికి పశువులతో సేద్యం చేయటం, వ్యవసాయ కూలీల ఖర్చు పెరిగి పోవటంతో దీనిని నియంత్రించ



**మస్తాన్‌వలి ట్రాక్టరును పరిశీలిస్తున్న హనీబీఎపి కో-ఆర్డినేటర్ శ్రీ దుర్గాప్రసాద్**




టానికి, త్వరితగతిని పూర్తి చేయటానికి ఒక చిన్న ట్రాక్టరు వుంటే బావుంటుందని భావించాడు. దానిపై ప్రయోగాలు చేసి, ఒక చిన్న ట్రాక్టరును రూపొందించాడు. ఈ ట్రాక్టరు వెడల్పు 31 అంగుళాలు, ఎత్తు 3 అడుగులు. కనుక పత్తి సాళ్ళలో సులువుగా వెళ్ళటానికి ఈ ట్రాక్టరు అనుకూలంగా వుంటుంది. పత్తి సాగుకు సంబంధించిన అంతర్ సేద్యపు పనులు (పత్తి నాటిన తర్వాత) అన్నిటినీ ఎటువంటి కూలీల సహాయం లేకుండా ఈ ట్రాక్టరుతో పూర్తి చేసుకోవచ్చు. పైగా ఈ ట్రాక్టరు సహాయంతో ఒక టన్ను బరువును కూడా సులభంగా తీసుకు వెళ్ళవచ్చు. ఈ ట్రాక్టరుకు కొన్ని పరికరాలు అమర్చటం ద్వారా అనేక ఇతర వ్యవసాయ పనులను కూడా చేసుకునే వీలుంది. 10.2 హార్స్‌పవర్ సామర్థ్యం కల ఇంజన్ కలిగివున్న ఈ ట్రాక్టరులో చాలావరకు ఆటో, ట్రాక్టరు భాగాలనే వినియోగించాడు. ఈ ట్రాక్టరుకు అవసరమైన అన్ని వ్యవసాయ పనిముట్లను డ్రైవర్ ఒక్కడే హైడ్రాలిక్ సహాయంతో ఆపరేట్ చెయ్యవచ్చు.

దేశంలోని అనేక లక్షల హెక్టార్లలో పండిస్తున్న పత్తి పంటలలోని అంతర్ సేద్యానికి ఈ ట్రాక్టరును వినియోగించుకోవటం ద్వారా నానాటికీ పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులను నియంత్రించవచ్చు. అంతే కాకుండా సరియైన సమయంలో సేద్యపు పనులను చేయటంతో పంట ఆరోగ్యంగా పెరుగుతుంది. ప్రస్తుత వ్యవసాయ కూలీల కొరత, పశువుల మేత ఖర్చులు ఇవన్నీ గమనిస్తే ప్రత్తిలాంటి పంటలను పండించే రైతులకు మస్తాన్‌వలీ మినీ ట్రాక్టరు ఒక వరమే.

**ట్రాక్టరు గురించి క్లుప్తంగా కొన్ని వివరాలు :**

- వ్యవసాయం మొదట్లో ఎద్దులతో మాత్రమే చేసేవారు. కాని ప్రస్తుతం వ్యవసాయంలో కూడా యంత్రాల వాడకం బాగా పెరిగింది. అందులో ట్రాక్టర్ ఒకటి.
- ఈ ట్రాక్టర్‌లను దుక్కి దున్నటానికి ఉపయోగిస్తారు కాని పొలంలో పైరు పెరిగిన తర్వాత ట్రాక్టరు ఉపయోగించటం దాదాపు కుదరదు.
- వ్యవసాయంలో అంతర సేద్యాలను ఎక్కువగా ఎద్దులతోనే చేస్తారు.
- షేక్ మస్తాన్ తనకున్న మెకానిజం అనుభవంతో పంట పొలాల్లో అంతర సేద్యానికి కూడా ఉపయోగ పడేందుకు అనుగుణంగా రూపొందించినదే ఈ మినీ ట్రాక్టర్.
- ఈ మినీ ట్రాక్టర్ ప్రత్తి, మిరప మొదలైన పంటల్లో అంతర సేద్యానికి చాలా ఉపయోగపడుతుంది.
- ఈ ట్రాక్టర్ యొక్క పరిమాణం చాలా తక్కువ సైజులో తయారు చేయటం జరిగింది.
- ఇంతవరకు ఇంత చిన్న పరిమాణంలో ట్రాక్టరును రూపొందించటం భారతదేశంలోనే మొట్ట మొదటిది.
- ఈ మినీ ట్రాక్టర కొలతలు – పొడవు 50 అంగుళాలు, వెడల్పు – 31 అంగుళాలు, ఎత్తు – 3 అడుగులు బరువు – 500 కిలోలు మాత్రమే.
- ఈ మినీ ట్రాక్టర్ ధర కూడా రైతులు కొనుగోలు చేయటానికి అందుబాటులో ఉండే విధంగా రూపొందించారు.
- కొంతమంది రైతులు ఎద్దులు కొని వాటి మేత, దాణ, ఇతర అవసరాలను చూసుకోవటం కష్టమౌతున్న ఈ రోజుల్లో ఈ ట్రాక్టరు చాలా వెసులుబాటు కల్పిస్తుంది.
- కొన్ని పంటలలో అంతర్ సేద్యానికి చాలా ఉపయోగ పడుతుంది.
- మినీ ట్రాక్టర్‌ను ఉపయోగించి వ్యవసాయం అత్యంత తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చు.
- ఈ ట్రాక్టరును ఉపయోగించి వ్యవసాయం చేయటానికి అవసరమైన గొర్రు, గుంటక, నాగలి వంటి పరికరాలను కూడా మస్తాన్‌వలి తయారు చేశాడు.
- మినీ ట్రాక్టర్ సహాయంతో ఒకలీటరు డీజిల్‌తో ఒక ఎకరం పొలం సేద్యం చేయవచ్చు.
- ఇప్పటివరకు మార్కెట్‌లో చాలా రకాల మినీ ట్రాక్టర్‌లు వున్నాయి కాని, వీటన్నిటితో పోలిస్తే మస్తాన్‌వలి తయారు చేసిన ట్రాక్టర్ తక్కువ కొలతలతో ఎక్కువ సేద్యాలకు అనువుగా వుంటుంది.

హనీబీఎపి ఈ ప్రముఖ ఇన్నోవేషన్‌ను గుర్తించి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో నమోదు చేయించింది. ఈ ట్రాక్టరును మార్కెట్‌లోకి తీసుకు రావటానికి శాయశక్తులా కృషి చేస్తోంది. రాష్ట్రంలోని రైతాంగం అతి త్వరలో ఈ ట్రాక్టరు ద్వారా తమ వ్యవసాయ పనులను సులభతరం చేసుకోవచ్చు. సరియైన మార్కెటింగ్ ప్రణాళికల ద్వారా దీనిని విదేశాలకు కూడా ఎగుమతి చేయటానికి వీలుంది.



# అంతర్జాతీయ గుర్తింపు పొందిన మన గ్రామీణ ఇన్నోవేటర్

# చింతకింది మల్లేశం

## Forbes releases list of seven most powerful rural Indians

Published: Sunday, Nov 14, 2010, 14:25 IST Place: Boston | Agency: PTI

Mansukhbhai Jagani, Mansukhbhai Patel, Mansukhbhai Prajapati and Madanlal Kumawat, are among Forbes' list of seven most powerful rural Indian entrepreneurs, whose "inventions are changing lives" of the people across the country.

IIM-Ahmedabad professor and founder of India's Honeybee Network Anil Gupta has selected the seven most powerful rural Indian entrepreneurs for a compilation in Forbes magazine.

"India's villages have become a hot bed of innovation, as its rural poor develop inventions out of necessity. Several of the people on this list have no more than an elementary school education," Gupta says.

Jagani developed a motorcycle-based tractor for India's poor farmers, which is both cost effective - costing roughly $318 - and fuel efficient (it can plow an acre of land in 30 minutes with two liters of fuel).

A farmer, Patel invented a cotton stripping machine that has significantly cut the cost of cotton farming and revolutionised India's cotton industry.

Prajapati, a potter, invented a clay non-stick pan that costs Rs100 and a clay refrigerator that runs without electricity for those who cannot afford a fridge or their electricity and maintenance costs, Gupta said.

Next on the list is Future Group chairman Kishore Biyani. Called the "Sam Walton of India," Biyani's company operates about three million square feet of retail space in 25 Indian cities.

Coming in next is social entrepreneur Anshu Gupta who founded GOONJ, a system that transfers used clothing and household goods from India's rich to its poorest communities.

Gupta collects 30 tonnes of cloth every month and distributes it across 20 states.

"He has an amazing reach, a simple network and excellent supply chain management," Gupta said, adding Troikka Pharmaceuticals MD Ketan Patel is "India's pain-killer."

Patel's business focuses on developing painless solutions for medical procedures.

He developed the world's first painless iclofenac injection, which helps alleviate acute pain and inflammation.

Also on Gupta's list is Dadaji Ramaji Khobragade, who invented the HMT rice, a highly successful rice variety which yielded 80% more rice than the conventional variety.

HMT is now grown all over India, on some 100,000 acres in five states.

Madanlal Kumawat, a grassroots innovator with no more than a fourth-grade education, developed a fuel-efficient, multi-crop thresher that yields cleaner grains, which can be bagged directly and eliminates the cost of cleaning.

***Gupta said his last pick Chintakindi Mallesham, inventor of the Laxmi Asu Machine, "ignited a revolution in India's weaving community."***

***Mallesham's machine can make six saris worth of material in one day, and "no human effort is required beyond placing thread on the machine and removing the material after the process is complete."***


ఆసు యంత్రం సృష్టికర్త 'చింతకింది మల్లేశం' పల్లెసృజన పాఠకులకు చిరపరిచితుడే. గత సంవత్సరం దేశంలో ప్రథమ బహుమతిని రాష్ట్రపతి చేతులమీదుగా తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విధంగా జాతీయ స్థాయిలో "గ్రామీణ ఇన్నోవేటర్" కు ఇంతటి గుర్తింపు రావడం ఎంతో ఆనందకరం.

నవంబర్ 14, 2010నాడు అమెరికాలోని 'బోస్టన్' నగరంలో "ఫోర్బ్స్" అనే ప్రముఖ అంతర్జాతీయ పత్రిక మన మల్లేశం ప్రతిభను గుర్తించింది. 'ఫోర్బ్స్' పత్రికలో పేరు రావటం అంతర్జాతీయంగా ఒక అరుదైన గుర్తింపు. భారతదేశ సమాజంలో అత్యంత శక్తివంతమైన మార్పును తీసుకురాగలిగిన ఏడుగురు గ్రామీణ ఇన్నోవేటర్లను ఫోర్బ్స్ పత్రిక గుర్తించి, ప్రచురించింది. అందులో మన చింతకింది మల్లేశం ఒకరు. బహుశా ఫోర్బ్స్ లిస్ట్‌లో ప్రప్రథమంగా గుర్తింపబడిన తెలుగు వాడు మల్లేశం అయుంటాడేమో!

ఆంధ్రప్రదేశ్‌లోని ఆలేరు నివాసి అయిన మల్లేశం 'పోచంపల్లి టై & డై చీరలు' నేసే ముందు వాటికి అవసరమైన 'ఆసు'ను యంత్రం ద్వారా పోసే పద్ధతి కనుగొన్నాడు. దీనివలన పని సులవు అవటమే కాక, ఎక్కువ పని జరిగే అవకాశం పెరగటమే కాక ఎంతోమంది శారీరక శ్రమను ముఖ్యంగా స్త్రీలకు ఎంతో వెసులుబాటును కల్పించింది.

హనీబీఎపి ద్వారా పరిచితులై, ఎన్.ఐ.ఎఫ్. ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మల్లేశంకు 'పల్లెసృజన' అభినందనలు. ఈ గుర్తింపుతో హనీబీఎపి బాధ్యత మరింత పెరిగింది. ఎంతమంది మల్లేశంలు మన రాష్ట్రంలో మరుగున పడివున్నారో అన్న ఆతృత ఎక్కువైంది. వీరిని వెతికి వెలుగులోకి తీసుకు రావలసిన బాధ్యత మనందరిపైనా ఉంది.

మల్లేశానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిన శుభ సందర్భంలో మనమంతా మరింతమంది మల్లేశంలను తెలుగు గడ్డనుంచి వెలుగులోకి తీసుకు రావటానికి నడుంకడదాం.



'శతమానం భవతి'

శీర్షికన 'పల్లెసృజన' సమర్పిస్తున్న మొదటి పరిచయం.

పరిచయకర్తలు
**జె శశిమోహన్,**
**వీర రాఘవ రెడ్డి,**
**భైరెడ్డి కోటీశ్వర రెడ్డి.**

# జ్ఞానపెద్దమ్మ నూరేళ్ళ మద్దమ్మ

కర్నూలునుండి పదికిలోమీటర్ల దూరంలోనున్న 'గార్గేయపురం' గ్రామానికి వెళ్తూ ఊరు ఇంకొంత దూరం ఉందనగా పెద్దావిడని ఎలా పలకరించాలి? ఎలా మాట కలపాలి? అని ఆలోచించుకుంటూ ఆ ఊరు చేరాం, ఆమె ఎదురు పడేసరికి "ఏం బాబూ ప్రయాణం బాగా సాగిందా? ఇదివరకయితే రోడ్లు బావుండేవి కాదేమో గాని, ఇప్పుడు మా ఊరికి మంచి రోడ్లు వచ్చాయి" అంటూ ఆమే పలకరించింది. మేం అవాక్కయ్యాం.

నీ పేరేంటమ్మా? అని అడిగితే అది తెలియకుండానే ఇంతదూరం వచ్చారా? అని నవ్వేసింది మద్దమ్మ. మీ వయస్సు ఎంతుంటుంది అని అడిగితే ఈరోజుల్లోలాగా ఆ కాలంలో రాసుకునేంత చదువులు మా వాళ్ళకెక్కడివి. అయినా నాకు గుర్తున్నంత వరకు ఊరివాళ్ళు చెప్పిందిబట్టి 95కి పైగా ఉండొచ్చు అంది.

మీ ఆహారపు అలవాట్లు ఏంటి అని అడగగా.... నేను పాయంల వున్నప్పుడు తిన్నది కొర్రబువ్వ, జొన్న సంకటే. ఇప్పటివేం తిండ్లో కడుపులోకి పోవటమే కష్టం.

చదువు గురించి మాట్లాడితే నవ్వేసి "ఇంకొంచెం చదివితే సర్కారు ఉద్యోగం వస్తుంది అనేవాళ్ళు మావాళ్ళు, నాలుగో తరగతి వరకు చదువుకున్నాను" అన్నది గర్వంగా. ఐదో తరగతి చదువుతుంతగానే పెళ్ళి చేశారు. ఇక చదువు అంతటితో ఆపాల్సి వచ్చేది. ఈ ఊరికి దగ్గరలో వున్న 'కొత్తూరు మా స్వగ్రామం, మా స్వగ్రామంలోనే 'ఎల్లనాగప్ప'కి నన్నిచ్చి పెండ్లి చేశారు. ఆ ఇంటికి పెద్ద కోడలినవటం చేత చాలా పనులుండేవి. ఎలాంటి పనులు అని అడగ్గా....

నాకు నలుగురు మరుదులు పొలానికి వెళ్ళొచ్చి అందరికీ వంట చేసేదాన్ని, వాళ్ళ పెండ్లిళ్ళు చేసిన, యారాండ్ల (మరుదుల భార్యలు) తో కలిసి కాపురం చేసిన పెద్ద సంసారం నాది. కోతలు కోసిన, వాములకు సొప్పలందిచ్చిన, సేలల్లనుంచి పెద్ద పెద్ద గడ్డిమోపులు మోసిన. ఇప్పటిలాగా పప్పులు, బియ్యము అంగళ్ళలో దొరికేవి కాదు. పప్పు కావాలంటే కందులు, పెసలు, శెనిగలు వినురుకోవాలి, కొర్ర బియ్యం కావాలంటే కొర్రలు



దంచుకోవాల్సిందే. సంకటి కావాలంటే జొన్నలు విసురుకోవాలి. తనకి కొర్రగూళ్ళు వేయటంలో చాలా నేర్పు ఉండేదని, అందరూ మెచ్చుకునేవారట. కొర్రగూళ్ళు వేయటం అంటే అదోరకమైన పనితనంతో (స్కిల్) కూడిన పని. కొర్ర పంట కోసిన తర్వాత వాటిని అలాగే గడ్డితో సహా కనీసం రెండు నెలలు అదే చేలో మగ్గించాలి. అంటే కోసిన పంటను ఒకచోటికి చేర్చి ఒక చిన్నపాటి గుడిసెలా పేర్చేవారు. భూమినుండి దాదాపు 8 అడుగుల వరకు కొర్ర కంకులు పైకి వచ్చేలా కొర్ర కట్టలను వరుసగా వృత్తాకారంలో పేర్చేవారు. అలా వృత్తాకారాన్ని తగ్గించుకుంటూ 8 అడుగులు వచ్చేసరికి పైన కోసుగా వుంటుంది. అప్పుడు ఆ పైన మళ్ళీ ఒక పెద్ద కొర్ర కట్ట తీసుకుని పైకి కంకులవద్ద ఒక తాడుతో (అదీ వరిగడ్డితో చేసింది) బాగా బిగించి కట్టి కొర్రగడ్డి క్రింది బాగాన్నంతా ఆ గుడి చుట్టూ వచ్చేలా వేసేవారు. ఇక ఎంత వర్షం వచ్చినా సరే ఒక్క చుక్క నీరు కూడా అందులో దిగే సమస్యే లేదు.

ఆరోగ్యం గురించి మాట్లాడితే... నాకింతవరకు పెద్ద రోగాలేవీ రాలేదు.... ఎప్పుడన్న తలనొప్పి వస్తే కణతలకు ఎల్లిపాయ రాసుకునేదాన్ని, పెద్ద పెద్ద బరువులు మోసినందుకు అప్పుడప్పుడు కడుపునొప్పి వచ్చేది. అయినా పొలాన్నుంచి ఇంటికి వచ్చినాక బువ్వ వండాల్సిందే. నలుగురు యారాండ్ల కాన్పులు జేసిన........ ఇవీ మద్దమ్మ చెప్పే తన మధురానుభూతులు......

కర్నూలుకు అతి సమీపంలోనున్న గార్గేయపురం గ్రామం మద్దమ్మది. ఆమెకు నలుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు. ప్రస్తుతం కొడుకు వద్దనే తన శేషజీవితాన్ని కుమారుడు పుల్లయ్య వద్దనే గడుపుతోంది. తన కుమారునికి కూడా ముగ్గురు కూతుళ్ళు ఒక కొడుకు. పుల్లయ్య చిన్న కూతురుకు తప్ప అందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ప్రస్తుతం ముని మనుమలు, మనుమరాళ్ళతో కాలక్షేపం చేస్తోంది.

శతవత్సర వృద్ధురాలైనా నేటికీ ఉదయం, సాయంత్రం తన ఇంటికి కావలసిన పాలు ఆ గ్రామంలో తనకి ఇష్టమైన కోటిరెడ్డి, రాణెమ్మల ఇంటికి వెళ్ళి తెచ్చుకుంటుంది. తనకస్సలు టీ, కాఫీ లాంటివేవీ అలవాటు లేవని, కేవలం మజ్జిగ కోసం, పిల్లల కోసం పాలు తీసుకెళ్తూ వుంటానని అంది. కంటిచూపు కాస్త మందగించింది కానీ, చెవులు బాగానే వినపడ్తున్నాయి.

ఆ కాలంలో గాంధీ నెహ్రూలను కూడా చూశానని, వారు కర్నూలు నుంచి శ్రీశైలంకు తమ ఊరిమీదుగా వెళ్తూ అక్కడ కాసేపు నిలబడ్డారని, అప్పుడు వారిని చాలా దగ్గరనుంచి చూశానని అంది. వాళ్ళేమైనా మాట్లాడారా? అంటే అంతా సంతోషంగా కలిసికట్టుగా ఉండండి అని హిందీలో చెప్పి వెళ్ళిపోయారు అని గుర్తుచేసుకుంది.

తన కూతుళ్ళంతా పెళ్ళిల్లయి వేర్వేరు చోట్ల బాగానే ఉన్నారని, తనుమాత్రం కొడుకు వద్ద వున్నానని అంది. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పెన్షనుతో కాలం గడుపుతున్నాను అంది.

ఇప్పటి ప్రపంచాన్ని చూస్తే ఎలా అనిస్తుందవ్వా అని అడిగితే ఏముంది బాగానే వుంది. అన్ని పనులకీ మిషన్లు వచ్చాయి. ఇక పెద్దగా పొడిచే పనేముంది? అని నవ్వేసింది. ఆమె నవ్వుతుంటే బోసినోట్లో కొన్ని పళ్ళు తళుక్కున మెరిశాయి. మేం కుతూహలంగా చూస్తూ అదేంటి పళ్ళు ఇంకా ఉన్నాయి? అని అడిగితే తనకు ఈ వయస్సులో మళ్ళీ పళ్ళు వస్తున్నాయి అని మద్దమ్మ అంది.

వంద సంవత్సరాలు దాటే కాలం త్వరలోనే వుందని అన్నప్పుడు "ఎవ్వరికీ ఇబ్బందులు కలిగించకుండా నా పనులు నేనే చేసుకుంటూ మా కాలం వెళ్ళిపోతే చాలని భగవంతున్ని వేడుకుంటున్నా"నని అంది.

హనీబీఎపి 'పల్లెసృజన' తరుపున సమాజపెద్ద తొమ్మిది దశాబ్దాలు చవిచూసిన అనుభవం కల మద్దమ్మ కాలం తెచ్చే



వృద్ధురాలు మద్దమ్మను సన్మానిస్తున్న హనీబీఎపి వలంటీర్ కోటీశ్వర రెడ్డి

మార్పులను అవగాహన చేసుకుంటూ తనదైన జీవన సరళిని కొనసాగించిన మహావ్యక్తి. మద్దమ్మను హనీబీఎపి కార్యకర్త కోటీశ్వర రెడ్డి చేతులమీదుగా శాలువాతో సత్కరించి, ఆమెకు నమస్కరించి, శ్రీమతి మద్దమ్మ గారి దీవెనలతో సెలవు తీసుకున్నాము.

**గత సంచికలో "శతమానం భవతి" శీర్షికలో వృద్ధులను గౌరవించాలన్న మా సంకల్పానికి రూపకల్పనగా హనీబీఎపి బృందం శ్రీమతి మద్దమ్మను కలవడం జరిగింది. ఈ శీర్షికన మీ గ్రామంలో, కుటుంబంలోని వృద్ధులను గురించి మీరు వ్రాస్తే 'పల్లెసృజన' సంపాదకవర్గం కృతజ్ఞతాపూర్వకంగా ప్రచురిస్తుంది.**

**– ఎడిటర్.**

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

**పల్లెసృజన ఒక జ్ఞానవేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. - సంపాదకవర్గం**

## స్పందన

ఎడిటర్ గారికి,

హృదయపూర్వక నమస్కారములు, "పల్లెసృజన" పత్రిక రైతులకు ఉపయోగపడే సూచనలు కొన్ని ఉన్నాయి. తెలుగు గ్రామీణ శాస్త్రవేత్తలకు జాతీయ బహుమతులు అందిస్తున్నందుకు ధన్యవాదములు. రైతులు కూడా శాస్త్రవేత్తలకు ధీటుగా ఉన్నారని 'పల్లెసృజన' ద్వారానే తెలుసుకున్నాము. పల్లెసృజన పాత పత్రికలు పంపించగలరు. పల్లెసృజన ద్వారా రైతులకు సంబంధించిన సమావేశాలు, మీటింగ్‌లు ఉంటే మాకు తెలియజేయ ప్రార్థన. భవదీయుడు

**– భవనం జయరామి రెడ్డి,**

కాత్యాళ్లూరు, పెదకూరపాడు మండలం, గుంటూరు జిల్లా.

రెడ్డిగారూ,

మీకు ప్రస్తుత పత్రిక పంపుతున్నాము. 'పల్లెసృజన' సంవత్సర చందా రూ. 150/–లు, పాత సంచికలు కావాలంటే ఒక్కో పత్రికకు రూ. 20/– యం.ఓ. గాని, పత్రిక చివరి కవర్ పేజిలో గల వివరాలను చూసి పంపండి.

– ఎడిటర్.



# సేంద్రియ వ్యవసాయం-కొన్ని ప్రయోగాలు

**పంట పొలాల్లోని చీడను నివారించటానికి సేంద్రియ వ్యవసాయం చేసే రైతులు రోజ్‌మెరి, థైమ్, లవంగాలు, పుదీన లాంటి సుగంధ ద్రవ్యాలను చాలాకాలం నుండి వినియోగిస్తున్నారని శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకున్నారు. కాకపోతే 'గుడుచి' మొక్కల ద్వారా మలేరియాని నియంత్రించవచ్చునన్న విషయం ఎందుకు పట్టించుకోవటం లేదు? ఇటువంటివి ప్రజారోగ్య కార్యక్రమాల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని గ్రహించాలి. టాంజానియా దేశం లోని 'మాసాయి' పిల్లలకి స్థానికంగా వుండే ఔషధ మొక్కల గురించి తెలిసినంతగా మరెవరికి తెలియదు. ఈ జ్ఞానాన్ని వారెంత కాలం కాపాడగలరు అన్నదే ప్రశ్న.**

## సేంద్రియ ఫలాలు మరియు కూరగాయలకి "కీటక నాశని సుగంధాలు" :

మనందరికీ తెలిసిన రోజ్‌మెరి, థైమ్, లవంగాలు, పుదీన సేంద్రియ వ్యవసాయదారులకు క్రిమి కీటకాలని నాశనం చేసే మంచి ఆయుధాలుగా ఉపయోగ పడుతున్నాయి. అమెరికన్ కెమికల్ సొసైటీ వారి 238వ జాతీయ స్థాయి సమావేశాల్లో కెనడాకు చెందిన శాస్త్రవేత్తలు పర్యావరణానికి ఏవిధమైన హాని చేయని ఈ ప్రకృతిసిద్ధమైన కీటక నాశన ఔషధాలపై పరిశోధనలు చేసి, చాలా ఆసక్తికరమైన ఫలితాలని వెల్లడించారు. ఈ కొత్త కీటకనాశన ఔషధాలలో సాధారణంగా కొద్ది మోతాదులో క్రిములను నాశనం చేసే మరియు పారద్రోలే గుణం కల 2 నుంచి 4 రకాల ఔషధ మొక్కలతో తయారు చేసిన కషాయాన్ని నీటితో కలిపి పిచికారి చేయాలి. ఇస్మాన్ మరియు కెనడాలోని బ్రిటీష్ కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు సహచరులతో కలిసి చేసిన పరీక్షల్లో ఈ మొక్కలకి క్రిమి సంహారక గుణం కలదని గమనించారు. కొందరు రైతులు అప్పటికే తమ సేంద్రియ పద్ధతిలో పండించే స్ట్రాబెర్రీ, పాలకూర, తమోట పంటలనాశించే చీడలకి విరుగుడుగా ఇటువంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారు. వీటిగురించి వివరిస్తూ ఇస్మాన్ కీటకాలకి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఈ ఔషధాలు కొత్త ఆయుధాలుగా చెప్పుకోవచ్చు అంటారు. మామూలు కీటకనాశనులను ప్రయోగించడం వల్ల అవి తట్టుకునే శక్తిని పెంచుకోవటం జరిగుతుంది. కానీ, ఈ ఔషధాలను వినియోగించటంవల్ల అటువంటి అవకాశం లేనేలేదు. కాకపోతే ఈ ఔషధాలని కొంచెం

ఎక్కువసార్లు మందు మోతాదును పెంచుకుంటూ (తక్కువ నీటిలో ఎక్కువ మందును కలిపి) వినియోగించాల్సి వుంటుంది. ఇంకా ఎక్కువ శక్తివంతమై వుండి ఎక్కువ కాలం పనిచేసే ఔషధాలకై శాస్త్రజ్ఞులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిలో కొన్నింటిని పర్యావరణానికి హాని కలిగించని విధంగా వుండటంతో పాటు దోమలు, ఈగలు, బొద్దింకలను పారద్రోలటానికి కూడా వినియోగ పడతాయి. ఇప్పటికే కొందరు ఉత్పత్తిదారులు పశువులమీద వాలే ఈగలు, పిరుదులను నివారించటానికి ఈ సుగంధ ద్రవ్యాలతో తయారైన ఔషధాలను తయారు చేస్తున్నారు. చైనాలోని శాస్త్రవేత్తలు తులసి జాతి మొక్కలు, బెర్గమోట్, పట్చోలి వంటి మొక్కలలోనుంచి నూనె పదార్థాలను తీసి క్రిమి సంహారక మందులు తయారుచేసే ప్రయత్నాల్లో ఉన్నారు. దీనికై అమెరికాలోని జార్జియాలోని ఆల్ఫరెట్టాకు చెందిన 'ఎకోస్మార్ట్' వృక్ష సంబంధ ఔషధాలు తయారు చేసే సంస్థ ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.

## ముంబయిలోని ఏకైక ప్రకృతి మొక్కల నర్సరీ :

ప్రకృతి మొక్కలతో వైద్యం చేసే 'రాజ్ మర్చంట్' గారి నర్సరీలో దాదాపు 500 రకాల ప్రత్యేక ఔషధ గుణాలున్న వివిధ రకాల సాధారణ, ప్రత్యేక మొక్కలు, గుబురు మొక్కలు, ఔషధ మొక్కలు, తీగలు, పూలు, పళ్ళ చెట్లు మొదలైనవి ఉన్నాయి. తనకెంతో ఇష్టమైన ఈ మొక్కలని రక్షించటమే కాక తన ఒకటిన్నర ఎకరాల భూమిని భూకబ్జాదారుల నుండి కాపాడుకోవటం అతని జీవిత ధ్యేయం అంటాడు. ముంబయి వాసులకి "మర్చంట్ వాడి" అనిపిలిచే ఇతని నర్సరీని మొదటిసారి చూస్తే శుభ్రం చేయని చిన్న అడవిలాగా కనిపిస్తుంది. తన తోటలోని మనీ ప్లాంట్ తీగని చూపుతూ ఆయన "దీనితో ఒక పన్నెండు సంవత్సరాల కుర్రాడికి తగిలిన గాయాన్ని పదిహేను రోజుల్లో నయం చేసాను" అని చెప్పారు. ఆ అబ్బాయికి గాజు సీసా పగిలి మణికట్టుదగ్గర గాయమైంది. అప్పుడా అబ్బాయి తండ్రితో "ఈ మొక్క ఆకులు కొన్ని నలిపి ఆ గాయంపై పూయండి అని చెప్పాను. నేను చెప్పినట్లుగానే గాయం పూర్తిగా మానిపోయింది" అన్నారు.

ఎన్నోచోట్ల ప్రయత్నించి నయంకాక విసిగిపోయిన వారికి రాజ్ మర్చంట్ ముంబయి, థానేలలో వున్న తన ఆరు చికిత్సాలయాలలో రాత్రి పగలు అనక వైద్యం అందిస్తూ వుంటారు. చాలామంది ప్రముఖ బాలీవుడ్ వ్యక్తులు ఇంకెక్కడా కుదరక ఇతని దగ్గరికి చివరి ప్రయత్నంగా వస్తూవుంటారు. మాజీ లోక్‌సభ స్పీకర్ 'మనోహర్ జోషి' గారు ఈయనని 2003లో పార్లమెంటుకి ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఈయన మందులు ప్రత్యేకించి హైపర్‌టెన్షన్, మధుమేహం, చర్మవ్యాధులు, ఆస్తమా, క్షయ, మెడనొప్పి, కీళ్ళ నొప్పులకి చాలా బాగా పనిచేస్తాయి. దాదాపు 3000 మంది థైరాయిడ్, మైగ్రేన్ రోగులకి స్వస్థత కల్పించిన ఈయన కొన్ని రకాల క్యాన్సర్లని కూడా నయం చేయగలను అంటారు. ఈయన ప్రస్తుతం ప్రకృతివైద్యంలో పట్టభద్రురాలైన తన కుమార్తె కవితతో కలసి భావి తరాలకోసం ప్రకృతిమీద ఒక పుస్తకం రాస్తున్నారు. ఇందులో ఆకులు, ఔషధ మూలికలకు సంబంధించిన ఎన్నో వివరాలు పొందుపరుస్తున్నారు. "ఎలాగైతే ప్రకృతి రోగాలను కల్పిస్తోందో, అదేవిధంగా దానికి ఔషధాలను కూడా ఇస్తోంది. కొన్ని దశాబ్దాల తర్వాత ఈ పృథ్వి పచ్చదనంతో నిండిపోయి, మానవాళికి జీవనాధారంగా వుంటుందని, ఉండాలని నా ఆశ" అంటారు రాజ్‌మర్చంట్.

## మూత్రము మరియు బూడిదతో సేంద్రియ ఎరువులు:

వినియోగదారులకి ఏవిధమైన రోగాలు రాకుండా టమోట పంటలో అధిక దిగుబడిని సాధించటానికి, అదేవిధంగా ఆహారపు పంటలలో వినియోగానికి మానవ మూత్రంలో బూడిదను కలిపి ఎరువుగా వాడే తొలి ప్రయత్నాలు ఆశాజనక ఫలితాలనిస్తున్నాయి. 'సురేంద్ర ప్రధాన్', అతని సహచరులు మానవ మూత్రంలో నత్రజని అధికంగా వుంటుందని, దానిని ఎరువుగా దోస, మొక్కజొన్న, క్యాబేజీ మొదలైన పంటలకు ఎరువుగా వినియోగించి విజయం సాధించారు. బూడిదలో అధికశాతం వుండే ఖనిజాల కాలణంగా కొన్ని రకాల నేలల్లో ఆమ్లాన్ని హరించే శక్తి వుందన్న భావనవున్నా, దాన్ని శాస్త్రరీత్యా ఎవరూ రుజువు చేయలేదు. అదేవిధంగా వాడుకలోవున్న మానవ మూత్రాన్ని బూడిదతో కలిపి వాడటంపై శాస్త్రవేత్తలు ఏవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. దీనికి సంబంధించిన పరిశోధనల వివరాలు అమెరికన్ కెమికల్ సొసైటీ వారి "అగ్రకల్చర్ & ఫుడ్ కెమిస్ట్రీ" అనే పత్రికలో ప్రచురించారు.



- మూలం : జట్టు ట్రస్టు (కపార్ట్ ప్రోగ్రాం)

## 5% కానుగపప్పు ద్రావణం

**తయారు చేసే పద్ధతి :**

నీడలో బాగుగా ఎండిన కానుగ గింజలనుండి తీసిన 5 కిలోల పప్పున 10 లీ. నీటిలో నాలుగు గంటలపాటు నానబెట్టాలి. కానుగ గింజల పప్పును మెత్తగా రుబ్బి, ఒక మూటలో కట్టి (10 నుండి 12 గంటలు) నానబెట్టాలి. ఆ నీటిలో మూటను ముంచి పట్టుకుని 15 నుంచి 20 నిమిషాల పాటు పిండుతూ ద్రావణం తీయాలి. ఈ ద్రావణం ఘాటైన వాసనతో పాలలాగ వుంటుంది. ఈ ద్రావణాన్ని పలుచని గుడ్డతో వడపోసి 100 గ్రా. సబ్బుపొడి కలపాలి. ఈ విధంగా తయారైన ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి 1 ఎకరం పొలంలో సాయంత్రంపూట పిచికారి చేయాలి. పంట దశను బట్టి, పురుగుల ఉధృతిని బట్టి కానుగ కషాయం మోతాదు పెంచుకోవాలి.

**నివారింపబడు పురుగులు :**

రసం పీల్చే పురుగులు, ఆకుముడత పురుగులు, పొగాకు లద్దె పురుగు, పచ్చ పురుగు, ఆకు నమిలే పురుగు.

**పనిచేసే విధానం :**


1. పురుగు గుడ్డు దశలో పిచికారి చేస్తే గుడ్డు పొదగకుండా చెడిపోతుంది.
2. పురుగు లార్వా దశలో పిచికారి చేస్తే పురుగు ఆహారం తినడం మానివేసి నెమ్మది నెమ్మదిగా చనిపోతుంది.
3. లార్వాదశ నుండి ఇంకొక దశకు అభివృద్ధి చెందకుండా చేస్తుంది.
4. ప్యూపా దశనుండి రెక్కల పురుగు (తల్లిపురుగు) విడుదల కాకుండా చేస్తుంది.

**సూచన :**

నీడలో బాగా ఎండిన కానుగ గింజల పొడిని కషాయం తయారు చేయడం కోసం ఉపయోగిస్తే 10-15 కిలోల కానుగపొడి అవసరం పడుతుంది.

**కానుగ గింజలు వినియోగం తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. చెట్టునుంచి రాలిన కానుగ పిక్కలను సేకరించాలి.
2. కానుగ గింజలను ఎప్పటికప్పుడు పప్పును వేరుచేసి నిలువ చేయాలి.
3. కాను గింజలను నీడలో ఆరనివ్వాలి.




4. కానుగ గింజలను, పలుచటి గోనెసంచులలో గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిలువ చేయాలి..

ఈ విధంగా జాగ్రత్త చేసిన కానుగ గింజలు ఒక సంవత్సరం వరకు ఉపయోగపడతాయి.

**కానుగపప్పు ద్రావణం వల్ల లాభాలు :**

1. పంట పూత దశలో ద్రావణం పిచికారి చేస్తే తల్లిపురుగులు కానుగ వాసనకి పంటపై గుడ్లు పెట్టవు.
2. కానుగ ద్రావణం చల్లిన ఆకులు చేదుగా ఉండటం వలన పిల్ల పురుగులు (లార్వాలు) ఆకులను తినలేవు.
3. కానుగ పప్పు ద్రావణం పురుగు గుడ్డు దశమీద, పిల్ల పురుగుల దశమీద బాగుగా పనిచేస్తుంది.
4. కానుగలో ఉండే "కరంజన్" అనే మూల పదార్థం పురుగు జీవిత దశపై ప్రభావాన్ని చూపిస్తుంది.
5. కానుగ ద్రావణంలో వున్న అనేక "లిమోనాయిడ్స్" పంటను ఆరోగ్యవంతంగా ఉంచడానికి సహాయ పడతాయి.
6. కానుగ ద్రావణం మానవుల ఆరోగ్యానికి, మిత్ర కీటకాలకు, పర్యావరణానికి ఎలాంటి హాని చేయదు.

**ఎన్నిసార్లు వాడాలి? :**

పంట దశను బట్టి పురుగుల ఉధృతిని బట్టి కానుగ ద్రావణాన్ని వాడవలసి వుంటుంది. ఈ ద్రావణాన్ని....

1. అన్ని పంటలలోను వాడవచ్చు.
2. వరి పంటలో ఒకటి నుండి రెండుసార్లు వాడవచ్చు.
3. మిరప, ప్రత్తి వంటి పంటలలో పురుగుల తీవ్రతను బట్టి 3 నుంచి 4 సార్లు వాడవచ్చు.
4. వేరుశనగ, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలలో 1 నుంచి రెండుసార్లు వాడవచ్చు.
5. అపరాలలో ఒకటి నుంచి రెండుసార్లు వాడుకోవచ్చు.

**కానుగ ఇతర ఉత్పత్తులు :**

1. కానుగ నూనె, 2. కానుగ పిండి.

**గమనిక :**

కానుగ పప్పు, వేప పప్పువలెనే పనిచేస్తుంది. వేపలోగల అన్ని గుణాలూ కానుగలో ఉంటాయి.

## పొగాకు కషాయం

1. పొగాకు రద్దు (కాడలు, ఉపయోగించని ఆకులు మొదలైనవి) ఒక కిలో తీసుకుని దానిని 10 లీ. నీటిలో అరగంటసేపు ఉడకబెట్టాలి.
2. ఉడుకుతున్న కషాయాన్ని మధ్యమధ్యలో ఒక కర్రతో కలియబెడుతూ ఉండాలి.
3. కషాయాన్ని బాగా చల్లార్చాలి.
4. చల్లార్చిన కషాయాన్ని పలుచని గుడ్డతో వడపోయాలి.
5. ఈ కషాయానికి 100 గ్రా. సబ్బుపొడి కలపాలి. పొగాకు ద్రావణాన్ని 100 లీ. నీటిలో కలిపి 1 ఎకరానికి సాయంత్రం పూట పిచికారి చేయాలి.

**నివారించబడు పురుగులు :**

పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, చిన్న చిన్న లార్వాలు.

**ఎలా పనిచేస్తుంది? :**

పొగాకులో సహజంగా ఉండే "నికోటిన్" మరియు ఇతర ఆల్కలాయిడ్‌ల వలన ఈ కషాయం పురుగుల నియంత్రణలో ఉపయోగపడుతుంది.



**సూచనలు :**

1. పొగాకు కషాయం పంటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే వాడాలి.
2. పంట కాలంలో ఒకసారి మాత్రం దీనిని వాడాలి.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

1. కుండలో ద్రావణాన్ని వేడిచేసేటపుడు ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి.
2. పొగాకు కషాయం పిచికారి చేసేటపుడు ఒంటిపై పూర్తిగా బట్టలు ధరించాలి.

## పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం తయారి

**ద్రావణం తయారు చేయు విధానం :**

1. మూడు కిలోల పచ్చిమిరపకాయలను కాడలు తీసి మెత్తగా నూరి దానిని 10 లీటర్ల నీటిలో ఒక రాత్రంతా నానబెట్టాలి.
2. అరకిలో వెల్లుల్లిపాయలను పొట్టుతీసి బాగా నూరి 250 మి.లీ. (పావులీటరు) కిరోసిన్‌లో ఒక రాత్రంతా నానబెట్టాలి.
3. మరునాడు మిరపకాయల ద్రావణాన్ని పలుచని గుడ్డతో వడబోసి, ద్రావణాన్ని సేకరించాలి.
4. అదేవిధంగా కిరోసిన్‌లో నానబెట్టిన వెల్లుల్లిపాయల ద్రావణాన్ని కూడా పలుచని గుడ్డతో వడపోసి ద్రావణాన్ని సేకరించాలి.
5. ఈ రెండు ద్రావణాలను కలపాలి.
6. దీనికి 75 గ్రాముల సబ్బుపొడిని నీటిలో కలిపి ద్రావణం చేసి ఒక లీటరు ద్రావణాన్ని పై ద్రావణానికి కలపాలి.
7. ఈ మూడింటిని కలిపినచో పచ్చిమిర్చి – వెల్లుల్లి ద్రావణం తయారవుతుంది.
8. ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రం వేళ పంటపై పిచికారి చేయాలి.

**నివారింపబడు పురుగులు :**

శనగపచ్చ పురుగు, లద్దెపురుగు, దాసరి పురుగు, ఆకుచుట్టు పురుగు, తొలిధశలలో ఎర్రగొంగళి పురుగు.

**ఎలా పనిచేస్తుంది :**

ఈ ద్రావణం పిచికారి చేయడం వలన పచ్చిమిర్చిలో వుండే "కేప్ససిన్" మరియు వెల్లుల్లిలో ఉండే "అల్లెసిన్" కలిసి పురుగుకు ఒకరకమైన తిమ్మెర గుణాన్ని కలుగజేస్తుంది. దీనివలన చిన్న పురుగులు చనిపోతాయి. ఎదిగిన పెద్ద




పురుగులు మొక్కలపై నుండి క్రిందపడి కొద్ది సమయంలో చనిపోతాయి.

**సూచన :**

పచ్చిమిర్చి – వెల్లుల్లి ద్రావణం చాలా శక్తివంతమైన ద్రావణం. కనుక దీనిని అవసరాన్ని బట్టి పంటలలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రం పిచికారి చేసి సత్ఫలితాలు పొందవచ్చు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

1. ద్రావణాన్ని తయారు చేసేటపుడు ఒంటికి కొద్దిగా నూనెను రాసుకోవాలి.
2. పిచికారి చేసేటపుడు ఒంటిపై పూర్తిగా బట్టలు ధరించాలి.
3. చిన్న పిల్లలను ద్రావణాన్ని తయారు చేసేటపుడు మరియు పిచికారి సమయంలో దూరంగా ఉంచాలి.

**కషాయాల వినియోగం తీసుకోవలసిన కొన్ని సూచనలు:**

1. పై కషాయాలను పంటలలో వాడిన తరువాత 4 లేదా 5 వ రోజున పశువుల పేడ – మూత్రంతో తయారు చేసిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. దీనివలన పంటకు వివిధ రకాల పోషకాలు సత్వరమే లభించి మొక్కలు ఆరోగ్య వంతంగా పెరుగుతాయి.
2. ఒకేరకం కషాయాలను ఎప్పుడూ వాడకూడదు.
3. కషాయాలను మార్చి మార్చి వాడుతూ మధ్యమధ్యలో పశువుల పేడ – మూత్రం ద్రావణాన్ని (పంచగవ్య) పిచికారి చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు.

**(వచ్చే సంచికలో మరికొన్ని ........)**

## ఎల్.వి.ఆర్. జూనియర్ కళాశాల, సీతారామపురం

# చిన్నారుల చిలిపి జ్ఞానం !



1. భూమి తిరుగుతూ వుంటే విమానం ఎక్కి ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ప్రయాణం చేయటం ఎందుకు? విమానం పైకి లేచి నిలుచుంటే భూమి తిరుగుతూ వుంటుంది. మనకు కావలసిన ప్రదేశం వచ్చినపుడు మళ్ళీ విమానంలోంచి దిగితే సరిపోతుంది కదా? విమానం కూడా ప్రయాణం చేయటం ఎందుకు?
2. భూమిలోపలికి పోవుకొలది ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఆకాశం వైపు పైకి వెళ్ళేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. అయితే సూర్యుని దగ్గరకు పోవుకొలది ఉష్ణోగ్రత తగ్గుతుంది కదా అయితే సూర్యుని దగ్గరకు ఎందుకు పోలేక పోతున్నారు?



3. డైమండ్‌ను అధిక ఉష్ణోగ్రత వద్ద కరిగిస్తే గ్రాఫైట్ ఏర్పడుతుంది. అయితే గ్రాఫైట్‌ను చల్లబరిస్తే ఎంతోకొంత పరిమాణం డైమండ్ ఏర్పడాలి కదా? అలా ఎందుకు ఏర్పడుట లేదు?
4. గాలికి దిశ, పరిమాణం లేదంటారు. అయితే విశ్వంలోకి ప్రయాణించి అన్ని గ్రహాలమీద ఉండవచ్చు కదా? భూమిమీద కొంత వరకు మాత్రమే ఉంటుంది ఎందుకు అలా జరుగుట లేదు?
5. భూమిలోపలఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే భూమిలోని నీరు ఆవిరై పోవాలి కదా? అలా ఎందుకు జరుగుట లేదు?
6. పర్యావరణంలో జరిగే మార్పులు కుక్కలు, నక్కలు మాత్రమే ఎలా పసిగడతాయి. ఇతర జంతువులకు ఎందుకు తెలియటం లేదు?
7. సముద్రం ఒడ్డున విస్ఫోటనాలు వస్తాయి. కానీ సముద్రం మధ్యలో నిశ్చలంగా ఉంటుంది. విస్ఫోటనాలు ఎందుకు రావు?
8. ఓ తల్లి రక్తపు గ్రూపు బిడ్డ మరొక రక్త గ్రూపు వుంటుంది? తల్లినుండే కదా బిడ్డ ఏర్పడేది వేరే రక్త గ్రూపు ఎలా ఏర్పడుతుంది?
9. భూమిమీద నుంచి కొంత నీరు ఆవిరై పైకి పోతుంది. చల్లగాలి తగిలినపుడు ఎక్కువ నీరు ఎలా వస్తుంది?

**– ఎ. వెంకట రెడ్డి**, సీనియర్ ఎం.పి.సి., ఎల్.వి.ఆర్. జూనియర్ కళాశాల, సీతారామపురం.

## ఫ్యాక్టరీల్లో వచ్చే పొగను వాతావరణానికి అనుకూలంగా మారిస్తే! మానవాళికి వినియోగపడేలా చేస్తే!!



ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణానికి చాలా అవరోధం ఏర్పడుతుంది. భారత దేశానికి కూడా ఈ సమస్య సంభవించింది. ఈమధ్య మా ప్రాంతాలలో పర్యావరణ కాలుష్యం వల్ల వర్షాలు సకాలంలో పడటం లేదు.

ముఖ్యంగా ఈ పర్యావరణ కాలుష్యం అనేది ఫ్యాక్టరీలపొగవల్ల. ఫ్యాక్టరీల దగ్గరలోని ప్రాంతాల్లో కొన్ని పరికరాలద్వారా ఆ పొగను గ్రహించి, శుభ్రపరచి మనకు అవసరమైన వాయువులను ప్రకృతిలోకి విడుదలచేసి మిగిలిన వాయువులను ఇతర ఉపయోగాలకు అనువుగా తయారు చేసుకోవచ్చు. బస్సులనుండి విడుదలయ్యే పొగ కూడా మనకు చాలా అవరోధంగా వుంది కనుక మనం బస్సుపై సోలార్ సిస్టమ్‌ని అమర్చి వాటి ద్వారా గ్రహించే ఉష్ణ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చి, ఆ శక్తిని నిల్వ చేసి, రాత్రిపూట కూడా వాహనాలను నడిపే విధంగా చేయవచ్చు. దీనికి అయ్యే ఖర్చు కూడా తక్కువే. దీనివల్ల డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని కూడా తగ్గించవచ్చు. అంతేకాక పర్యావరణ కాలుష్యం నుండి సమస్త మానవాళిని రక్షించవచ్చు.

ఫ్యాక్టరీలనుండి విడుదలయ్యే పొగను సన్నని ఎత్తైన గొట్టం నుండి పంపడం వల్ల ఆ పొగ వేగంగా బయటకు వస్తుంది. అక్కడ టర్బయిన్‌లను వినియోగించడం వల్ల వేగంగా వస్తున్న పొగ తాకిడికి ఆ టర్బైన్స్ తిరగడం వల్ల విద్యుత్తు తయారు చేయవచ్చు.

## సులభంగా విద్యుత్ తయారు చేసే ఉపాయాలు!

మా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా చాలా తక్కువ కనుక సూర్యరశ్మి సహాయంతో కాంతిని గ్రహించి, అక్కడ విడుదలయ్యే ఈ కాంతి శక్తిని యాంత్రిక శక్తిగా మార్చి మోటార్లకు అంధించడం వల్ల మనకు కావలసినంత ఇంధనం మిగులుతుంది. అంతేకాక, దీనివల్ల కిరోసిన్, విద్యుత్ వాడకాన్ని తగ్గించడమే కాక సులభంగా కాంతిని వినియోగించుకోవచ్చు. ఈమధ్యకాలంలో అతి ఎక్కువ వాహనాలు తిరగటం మనం గమనిస్తున్నాము. అవి వేగంగా వెళ్ళేటపుడు రోడ్ల క్రింది భాగంలో కొన్ని పరికరాలను అమర్చడం వల్ల ఆ రాపిడిని విద్యుత్‌గా మార్చవచ్చు. ఈ విధంగానే ఫుట్‌పాత్‌లపై కూడా దీన్ని అమర్చినట్లయితే ఎంతో ఉపయోగకరం.

ప్లాటినం వస్తువుని తీసుకుని దానిపై నల్లని పూత వేయడం వల్ల ఈ ప్లాటినం అత్యధిక ఉష్ణాన్ని గ్రహిస్తుంది. ఈ ఉష్ణశక్తిని విద్యుత్ శక్తిగా మారిస్తే మనకు ఎంతో ఉపయోగకరం.

## వాహన ప్రదామాలను ఇలా నివారించగలిగితే !

ఈమధ్య మన రాష్ట్రంలో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలను నివారిండం ప్రతిఒక్కరి బాధ్యత. దీనికి ఒకే ఒక్క కారణం కంపెనీ తయారు చేసే వాహనాలకు రాపిడి జరగగానే అక్కడ విద్యుదయస్కాంత ప్రేరణతత్వం జరిగే అయస్కాంతాలను అమర్చాలి. ఏ విధంగా అంటే....

రెండు వాహనాలు ఢీకొనేటప్పుడు సెకనులోకన్న అతి తక్కువ కాలంలో వాటిమధ్య రాపిడి జరుగుతుంది. ఈ రాపిడి జరగ్గానే అక్కడ విద్యుదయస్కాంత ప్రేరణ కలగాలి. ఇక్కడ జరిగే ఈ ప్రేరణత్వం వల్ల ఆ రెండు వాహనాలు వికర్షణ శక్తి జరిగి కొన్ని సెంటీమీటర్ల దూరం జరగాలి. కనుక ఏదైనా ఒక కారుయొక్క ఉత్తర ధృవం వుంటే ఢీకొన్న కారుయొక్క అయస్కాంతం అనేది ఉత్తర ధృవంగా (లేదా దక్షిణ అయస్కాంత ధృవంగా) మార్పు చెందాలి. ఈవిధంగా చేసినట్లయితే వాహన ప్రమాదాలను నివారించవచ్చు. అంతేకాక ఈ ప్రమాదాలనుండి జరిగే అపారమైన ప్రాణనష్టం మరియు ధననష్టాన్ని నివారించవచ్చు. ఈ విషయం సాధ్యమయ్యేటట్లు చేయాలి? ఎలా?

**– యం.వి. గణేష్,** ఇంటర్ మొదటి సంవత్సరం, సీతారామపురం, నెల్లూరు జిల్లా. ఫోన్ : 94932 33585

# మోటార్ సైకిల్‌తో వినూత్న ప్రయోగం - దానితోనే వాటర్ సర్వీసింగ్




## జడ్చర్లలో అనుమోలు శ్రీనివాస్ అద్భుత ఆలోచన


జడ్‌చర్లకు ఆరుకిలోమీటర్ల దూరంలో వున్న రంగాపురం గ్రామస్తులు లక్ష్మయ్య, లక్ష్మమ్మల ద్వితీయ పుత్రుడు అనుమోలు శ్రీనివాస్, ఆరవ తరగతి వరకు చదివి, కుటుంబంలోని ఆర్థిక కారణాల వల్ల ఇకపై చదవలేక పోయాడు. ద్విచక్ర వాహనాలు రిపేరి చేయటం ఇతని వృత్తి. చాలా వాహనాలు కళ్ళెదురుగా సర్వీసింగ్ కోసం ఇతర చోట్లకు పంపాల్సి వస్తోంది. మనవద్ద అన్ని సౌకర్యాలు ఉండి కూడా ఇతరుల వద్దకు సర్వీంగ్‌కు పంపటం వల్ల జరుగుతున్న కష్టాన్ని నివారించాలని ఆలోచించి



ఈ ప్రయోగాన్ని ప్రారంభించి, అందులో కృతకృత్యుడయ్యాడు శ్రీనివాస్.

నీకీ ఆలోచన ఎలా వచ్చింది? దానికి మూలం ఏమిటి అని అడిగితే "జడ్‌చర్లలో ఇళ్ళమధ్య మోటార్ సైకిల్ వాటర్ సర్వీసింగ్‌కు షట్టర్ ఇవ్వాలంటే ఇవ్వడం లేదు. నేను గతంలో వున్న షట్టర్ వాళ్ళుకూడా వాళ్ళకు ఇబ్బంది అవుతోంది ఖాళీ చేయమన్నారు. అప్పుడు ఈ షట్టర్ వాళ్ళు ఇస్తామన్నారు కానీ ఇక్కడ కరెంటు లేదు. సరే రిపేరీలైన చేసుకోవచ్చు కదా అని షట్టర్ తీసుకున్నాను. ఆ తర్వాత ఆలోచించాను. సర్వీసింగ్‌కు అవసరమైన వాటర్ పంపు నావద్ద వుంది కానీ అది పని చేయాలంటే కరెంటు అవసరం. ఏం చేద్దామా అని ఆలోచించగా ఈ మిషన్‌ను తిప్పగలిగితే చాలు కదా అన్నదగ్గర నా ఆలోచన మొదలైంది. ఒక మోటార్ సైకిల్‌పై ముగ్గురు వ్యక్తులు కూర్చున్నా లాగుతుంది కదా! అంటే దాదాపు ఒకటిన్నర క్వింటాళ్ళ బరువు లాగుతుంది. అలాంటిది మోటార్ సైకిల్ ఈ మిషన్ను తిప్పలేదా అని ఆలోచించాను. అలా తోచిందే తడవుగా పని మొదలు పెట్టాను చైన్ స్ప్రాకెట్ షాఫ్ట్ వద్ద ఈ మిషన్ షాఫ్ట్‌ను తగిలించాను.





మిషన్‌ను తిరిగింది, కావలసిన ప్రెషర్‌తో నీటిని చిమ్మటం మొదలైంది. ఈ ప్రెషర్‌ను ఇంకా పెంచుకోవచ్చు కానీ మోటార్ సైకిల్ సర్వీసింగ్‌కు ఈ ప్రెషర్ చాలు. ఇంతకన్నా ప్రెషర్ పెంచితే ఈ మిషన్‌కు వున్న ప్రెషర్ సిలిండర్ పగులుతుందేమోనని పెంచటం లేదు. మోటార్ సైకిల్‌లో మాత్రం ఇంకా ప్రెషర్ పెంచినా నడుపగల శక్తి వుంది" అన్నాడు శ్రీనివాస్.

దీన్ని ప్రారంభించడం కోసం మోటార్ సైకిల్‌కు నీటిని పంప్ చేసి మిషన్‌కు అనుసంధానం చేయటం కోసం వాటి ఎత్తును సమానంగా ఉంచడం కోసం వడ్రంగి వద్ద కూర్చుని కావలసిన విధంగా ఎత్తును పెంచే ఏర్పాటు చేసుకున్నాడు. ఈ మిషన్‌తో ఇప్పుడు అన్ని మోటార్ సైకిళ్ళకు తనే సర్వీసింగ్ చేసుకుంటాడు. మోటార్ సైకిల్‌ను ఉపయోగించి, ఒక లీటరు పెట్రోలుతో 30 వాహనాలకు సర్వీరింగ్ చేస్తాడు. కరెంటుకన్నా కాస్త ఎక్కువ ఖర్చు అయినా నా షాపుకు కరెంటే లేదు కాబట్టి నా సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు శ్రీనివాస్. గ్రామాల్లో కూడా సర్వీసింగ్ చేసుకోవాలి అనుకునే వాళ్ళకు ఇది చాలా ఉపయోగ కారిగా వుంటుంది. ఎందుకంటే గ్రామాల్లో విద్యుత్ సరఫరా సరిగ్గా వుండదు కాబట్టి ఇలా తయారు చేసుకుని తమ సమస్యను అధిగమించుకోవాలని తోటి మెకానిక్‌లకు సూచిస్తున్నాడు శ్రీనివాస్. ఇది తయారు చేసుకోవటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఉచితంగానే అందిస్తానని అంటున్నాడు.

దాదాపు మోటార్ సైకిల్ మెకానిక్‌లందరికీ వాహనం తప్పకుండా ఉంటుంది. సర్వీసింగ్ మోటార్ సుమారు 15 వేలదాకా అవుతుంది. ఇక కావలసింది కేవలం రెండు మూడువందల రూపాయల ఖర్చుతో రెండింటినీ అనుసంధానం చేసి గ్రామాల్లో సర్వీసింగ్‌ను నిర్విఘ్నంగా కొనసాగించవచ్చు.

శ్రీనివాస్ ఈ మోటార్ సైకిల్‌ను అవసరమైనప్పుడు సర్వీసింగ్‌కు ఉపయోగించటంతో పాటు రోజూ తాను ఊరికి వెళ్ళటానికి ఇదే మోటార్ సైకిల్‌పై వెళుతుంటాడు. దీన్ని ఇంకా అభివృద్ధి కూడా చేసుకోవచ్చు. అవసరమైనపుడు కరెంటుకు కూడా ఉపయోగించుకునే విధంగా రెండు విధాలుగా ఉపయోగ పడేలా తయారు చేయాలని ఆలోచిస్తున్నాడు. కరెంటు వచ్చినప్పుడు మోటార్ సైకిల్‌ను తొలగించుకోవలసిన అవసరం లేకుండా కూడా ఈ మిషన్ నడిచేలా తయారు చేస్తున్నాడు.

శ్రీనివాస్ వినూత్న ప్రయోగం హనీబీఎపి దృష్టిలోకి వచ్చింది. వెంటనే దీన్ని ఎన్.ఐ.ఎఫ్.కు పంపి, రిజిస్ట్రేషన్ చేయటం జరిగింది. పదిమంది పల్లెవాసులకు ఉపయోగపడే శ్రీనివాస్ ఆలోచనను ముందుకు తీసుకువెళ్ళటానికి నడుంకట్టింది. తనలాంటి వారు గ్రామాల్లో సర్వీసింగ్ పెట్టేవారికి ఉచితంగా తన వినూత్న ఆలోచనను పంచుతున్న అనుమోలు శ్రీనివాస్ ఔదార్యం అభినందనీయం.

●



# మనమే కరెంటు ఉత్పత్తి చేద్దాం!

– శ్రీ జె. శశిమోహన్

అయ్యో కరెంటు పోయిందే! ఈ కరెంటు ఇప్పుడే పోవాలా?! ఇంకొంచెంసేపుంటే బావుండేది!!

ఇక్కడో విషయం ఆలోచిద్దాం! కరెంటు పోవటంతో మనకు కలిగిన అసౌకర్యాల గురించే ఆలోచిస్తున్నాం కానీ, కరెంటు తయారు చేయటానికి, దానిని అన్ని ప్రాంతాలకు సరఫరా చేయటానికి ఎంతటి వ్యవస్థ కావాలో ఆలోచించం. ప్రభుత్వం ఒకటి రెండు యూనిట్ల కరెంటు తయారు చేయదు. అది తయారు చేయాలంటే కొన్ని లక్షల కోట్ల రూపాయలు ఖర్చవ్వాలి. అదీ మనడబ్బే అని గుర్తుంచుకోవాలి. జలవిద్యుత్ కానివ్వండి, థర్మల్ విద్యుత్ కానివ్వండి. ఒక ప్రాజెక్టు కట్టాలంటే, ప్రారంభించాలంటే, నడపాలంటే కొన్ని కోట్ల రూపాయలు కావలసి వుండటమే కాక, కొన్ని సంవత్సరాల సమయం కూడా పడుతుంది. అణు విద్యుత్ అయితే దానికి అవసరమైన సాంకేతి పరిజ్ఞానం, దాన్ని నడిపే సాంకేతిక నిపుణులు, దాని ఖర్చులు సరేసరి. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుల వల్ల పర్యావరణానికి ఎంత హాని జరుగుతుందో కూడా గమనించాలి.

ఇంకోవిషయం! మనం అవసరం లేకుండా ఎన్నిసార్లు లైట్లు అలాగే ఉంచేసి బైటకెళ్తుంటాం? అవసరం లేనిచోట లైట్లు ఎన్నిసార్లు పెట్టాం. అవసరాన్ని మించిన వెలుగునిచ్చే బల్బులను ఎంతమంది వినియోగించటం లేదు? ఇక ఫ్యాన్లు, ఏసీలు, హీటర్లు వీటిసంగతి సరేసరి. దేశంలోని ప్రతి పౌరుడూ రోజుకు ఒక్క యూనిట్ కరెంటును పొదుపు చేయగలిగితే! ఊహించండి!!

ఇంతవరకు ఆలోచించిన వాళ్ళం ఇంకొక్క అడుగు ముందుకేసి విద్యుత్తు పొదుపు చేయటమే కాక, మనమే ఉత్పత్తి చేస్తే ఇంకెంత బావుంటుందో ఆలోచించండి. ఈ విషయాన్ని విని ఆశ్చర్యపోవద్దు. విద్యుత్తు తయారీకి ఏదైనా తిరుగుతున్న చక్రం ముఖ్యం. తగు ఏర్పాట్లు చేయటం ద్వారా తిరుగుతున్న చక్రం నుండి డైనమోను వినియోగించడం ద్వారా విద్యుత్తును తయారు చేయవచ్చు!! తిరుగుతున్న చక్రాలు ఎక్కడెక్కడ కనిపిస్తాయో ఒక్కసారి గమనించండి. ముందుగా ఆరోగ్యానికే ప్రాధాన్యతనిస్తున్న ఈ రోజుల్లో ఉదయమే నడవటం, జాగింగ్ చేయటం పరిపాటి. ఇది సాధ్యం కానివాళ్ళకోసం ఇంట్లోనే సైకిల్ లాంటి పరికరం ఏర్పాటు కూడా ఉంది. దీనిమీద కూర్చుని పెడలింగ్ చేస్తూ వుంటే చాలు అన్ని రకాల వ్యాయామాలు చేసినట్లే. రోజూ ఇలా కొన్ని గంటల పాటు ఎన్ని లక్షల మంది చేస్తున్నారో. ఆ వ్యాయామం కోసం తిరుగుతున్న చక్రానికి తగిన ఏర్పాట్లు చేసి ఒక డైనమో తగిలిస్తే ఒక యూనిట్ విద్యుత్‌నైనా తయారు చేయవచ్చు కదా? ఇలా ఉత్పత్తి చేసిన విద్యుత్తును ఏ వంటింట్లో మిక్సీ తిరగటానికో, బాత్‌రూంలో హీటర్ కోసమో స్టడీ రూంలో కంప్యూటర్ కోసమో లేదా మరే అవసరానికైనా వినియోగించుకో వచ్చు కదా! లేదా, ఓ ఇన్వర్టర్ లాంటి దాంట్లో ఈ విద్యుత్తును నిలువ వుంచి అవసరమైనపుడు వాడుకోవచ్చు కదా. ఇక ఏ.సి. కరెంటు, డి.సి. కరెంటు అధిగమించలేని సమస్యలేమీ కాదు.

బట్టలు తయారు చేసే కంపెనీల్లో ఎన్ని వందల, వేల కుట్టు మిషన్లు నిరంతరం తిరుగుతునే వుంటాయి. ఫ్యాన్లూ తిరుగుతునే వుంటాయి. ఎన్నో గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లు తిరుగుతునే వుంటాయి. ఎలా చేయాలి అన్నది కాదు, చెయ్యాలి అన్న ఆలోచన ముఖ్యం. సంకల్పం బలంగా వుంటే మార్గాలు అవే దొరుకుతాయి. ఇలా తిరుగుతున్న వాటినుండి ఉత్పత్తి అయిన విద్యుత్తుతో కనీసం ఆ గదిలోని బల్బులు వెలిగించినా దేశానికి ఎంతో లాభాన్ని ఆర్జించినట్టే కదా! మామూలుగా ఒక యూనిట్ కరెంటును పొదుపు చేస్తే దానిని ఉత్పత్తి చేసినట్లే అంటారు. మనము పొదుపూ చేద్దాం. ఉత్పత్తీ చేద్దాం.

ఏమో! కొన్నాళ్ళకి మనుషులు కలిసినపుడు ఎన్ని క్యాలరీల బరువు తగ్గారు అని కాకుండా ఎన్ని యూనిట్ల కరెంటు ఉత్పత్తి చేశారు అని పలకరించుకునే కాలం వస్తే బాగుంటుందేమో!

మీ ఊళ్ళో మీరెలా కరెంటు ఉత్పత్తి చేయగలరో మాకు తెలపండి. మీ ఆలోచనలు అమలుపరచటానికి ఏ సహాయం కావాలో తెలపండి. మీ ఆలోచనలను మీ హక్కులుగానే కాపాడుతూ అది ఫలవంతం అవటానికి కావలసిన సహాయం అవసరమైతే ఆర్థిక సహాయంతో సహా మీకందజేయటానికి హనీబీఏపి ఎల్లప్పుడూ సిద్ధమే! మీ ఆలోచనలతో 'హనీబీఏపి'ని సంప్రదించండి.



# ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు

## సృజనాత్మకతతో వెలుగునిచ్చే దివ్వెలు

**ఎక్కడికైనా సులభంగా తీసుకువెళ్ళగలిగే వెల్డింగ్ మిషన్ :**

66 సంవత్సరాల సఖ్‌రామ్ మేస్త్రి ఒక ఎలక్ట్రీషియన్. గ్రామీణ ప్రాంతాలలో సహజంగా లోవోల్టేజి విద్యుత్ సరఫరా వుండటంతో అక్కడ పనిచేయడానికి సరిపోయే సింగిల్‌ఫేజ్



వెల్డింగ్ మిషన్‌ను రూపొందించాడు. తాను 8 సంవత్సరాల వయసులో వుండగానే తండ్రి చనిపోవడంతో మొత్తం కుటుంబ భారం అతని భుజాలపై పడింది. చిన్న వయస్సులోనే ఎన్నో కష్టాలను చవిచూశాడు. తన అపార అనుభవం, సహజ జ్ఞానంతో 2005లో తన ఆలోచనలకు రూపకల్పన చేశాడు. ఈ పరికరం ద్వారా వెల్డింగ్ పని చాలా సులువుగా జరిగేది. జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) వారు రాంచి లోని "బిట్" మెస్రాలో అలాగే ఐ.ఐ.టి. గౌహతిలో ఈ పరికరానికి పరీక్షలు నిర్వహించే ఏర్పాటు చేశారు. ఈ వెల్డింగ్ మెషిన్‌తో చేసే వెల్డింగ్ మరింత బలంగా కూడా ఉంటుందని నిర్ధారించారు. "నువ్వు డబ్బు సంపాదించి భవంతులు కట్టవచ్చు, కాని నీవు నిజమైన పనిమంతుడివి అనుకుంటే సమాజ అభివృద్ధికి సమాజంలో పాల్పంచుకునే ఏదో ఒక మంచి పనిచెయ్యి" అన్న మరణించిన తన తండ్రి మాటలు సుఖరామ్ మనసులో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే వుంటాయి.

**వివిధ రకాలుగా ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాలు :**

38 సంవత్సరాల మనోజ్ కుమార్ నారంగ్ ఒక ఎలక్ట్రానిక్ షాప్ యజమాని. మన



రోజువారి జీవన విధానం హాయిగా, సులభంగా గడవడానికి వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధనలు చేసేవాడు మనోజ్. 1997లో ఒక పాఠశాలలో తన సమీప బంధువుకోసం తనంతట తానుగా పనిచేసే లైటింగ్ విధానాన్ని రూపొందించినందుకు బహుమతి పొందాడు. దుకాణాలలో జి.ఎస్.ఎమ్. ఆధారిత సెక్యూరిటీ విధానం, ప్రయాణంలో మొబైల్ ఛార్జింగ్ విధానం, ఎయిర్ కూలర్ పంపులలో విద్యుత్ ఆదా పరికరం, వాహనాలకు ఆటోమేటిగ్ డిప్పర్లు మొదలైనవి మనోజ్


కుమార్ పరిశోధనలలో కొన్ని. కేవలం విజయాలనే కొనియాడే సమాజం అంటే అతనికి అసంతృప్తి. “కొన్ని సమయాలలో గమ్యానికన్నా ప్రయాణం ఎంతో ముఖ్యం” అంటారు మనోజ్.

**గాలి వత్తిడి ద్వారా పనిచేసే సాంకేతిక యంత్రం :**


గాలి వత్తిడి ద్వారా పనిచేసే యంత్రాలు గాలి వత్తిడిని శక్తిగా రూపాంతరం చెందించి, ఆ శక్తితో పనిచేస్తాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలోని మారుమూల స్థాయి పరిశోధకులు తమదైన


హరి నారాయణ

శైలిలో శక్తిని తిరిగి పొందలేకపోవడం అనే సమస్యతో సతమతమయ్యేవారు. వారు ఊహాజనితంగా గాలి వత్తిడినుండి శక్తిని తయారు చేసే యంత్రాలు నడిచేట్లు రూపకల్పన చేశారు.


అశోక్ సింగ్ రామ విశ్వకర్మ

వృత్తిరీత్యా ఒక మెకానిక్‌గా పనిచేసే రాజస్థాన్‌కు చెందిన హరినారాయణ గాలి వత్తిడి ద్వారా నడిచే స్కూటర్‌కు రూపకల్పన


రషీద్ పర్వేజ్ కనక్ గోగి

చేశారు. 2006లో దీనిపై హక్కులకోసం 1632/డెల్/2006 దరఖాస్తు దాఖలు చేశాడు. ఉత్తరాఖండ్‌కు చెందిన అశోక్ కుమార్ సింగ్ అనే వ్యవసాయదారుడు గాలివత్తిడి ద్వారా శక్తిని పుట్టించే విధానాన్ని అనుసరించి ధాన్య నూర్పిడి యంత్రం, కలుపుతీసే


నరేంద్ర కుమార్

యంత్రం, సిమెంటు మరియు చక్కెర కర్మాగారాలలో ఉపయోగించే యంత్రాలకు రూపకల్పన చేశాడు. అలాగే ఎత్తైన ప్రదేశాలకు ఎలాంటి ఇంధనం వాడకుండా గాలి వత్తిడి ద్వారా పనిచేసే నీటిపంపులను రూపొందించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిరక్షరాస్యుడైన ఒక మెకానిక్ విశ్వకర్మ గాలి వత్తాడితో పనిచేసే ఒక ఇంజన్‌ను రూపొందించాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రషీద్ ఫర్వేజ్ ఖాన్ అనే వ్యక్తి కంప్రెస్డ్ ఎయిర్ ఇంధనంగా పనిచసే 800 సిసి. మారుతి కారు ఇంజన్‌కు రూపకల్పన చేశాడు. అస్సాం కు చెందిన కనక్ గొగోయ్ కంప్రెస్డ్ ఎయిర్‌తో నడిచే రెండు సీట్ల కారును రూపొందించాడు. అలాగే ఉత్తర ప్రదేశ్‌కు చెందిన నరేంద్రకుమార్ హీరో హొండా పెట్రోలు ఇంజన్‌ను డీజిల్ మరియు కంప్రెస్డ్ ఎయిర్‌తో నడిచే ఇంజనుగా మార్చాడు.

**వ్యవసాయ సంబందిత మెషినరి మరియు ఆహార పదార్థాల తయారీ సాంకేతిక పరికరాలు :**

**చెఱకు కణుపులు కోసే పరికరం - ఇతరములు :**

ఉన్నత పాఠశాలలో పనిచేసే 43 సంవత్సరాల రోషన్‌లాల్ విశ్వకర్మ తన వర్క్‌షాప్‌లో వ్యవసాయ సంబంధిత పరికరాలను రిపేరు చేస్తూ, క్రొత్త పరికరాల రూపకల్పనపై పరిశోధనలు చేస్తాడు. చెఱకు సాగులో





సమయాన్ని, డబ్బును, విత్తనాన్ని ఆదా చేసేందుకు చెఱకు మొగ్గలను సిన్నితంగా కత్తిరించి, తిరిగి నాటడానికి ఉపయోగ పడేలా ఒక పరికారానికి రూపకల్పన చేయవలసిందిగా ఒక ఇంజనీరు విసిరిన సవాల్‌కు సమాధానంగా రోషన్‌లాల్ ఒక పరికరానికి రూపకల్పన చేశాడు. ఈ పరికరం హ్యాండిల్‌తో ఒత్తగానే అది చెఱకు కణుపులను సున్నితంగా కత్తిరిస్తుంది. (ఈ యంత్రాన్ని గురించి గతంలో “పల్లెసృజన”లో ప్రచురించడం జరిగింది). వీటిని నాటడం ద్వారా చెఱకు సాగు చేసుకోవచ్చు.

రోషన్‌లాల్ ఒక నిరంతర అన్వేషి. చెఱకు కణుపులను కత్తిరించే యంత్రం, చెఱకు పంటను కోసే పరికరం, ట్రావెలింగ్ ఐరన్, ఆటోమేటిక్ స్ప్రే పంప్, 3 ఫేస్ మోటార్‌కు టైమర్ ఇతరములక రూపకల్పన చేశాడు. రోషన్‌లాల్ పేరుపై పేటెంట్ హక్కులకోసం జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) దరఖాస్తు చేసింది.

**రీపర్ ఎండ్రోయర్ :**

ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 55 సంవత్సరాల భగవాన్‌సింగ్ డంగి ఒక వ్యవసాయదారుడు. వ్యవసాయ పనిముట్లకు మరమ్మత్తు చేసేవాడు. ఇతని పరిశోధనలలో కొన్ని



భూమిని చదును చేయుటకు, కరకట్టల నిర్మాణానికి తోడ్పడే ట్రాక్టరు ముందు భాగాన అమర్చే బ్లేడ్, బోర్‌వెల్స్ నుండి వచ్చే నీటిని పెంచేందుకు ఒక రబ్బరు పరికరం మొదలగునవి సోయాబీన్ సాగులో విత్తనాలపై పొరలను తొలగించడం కూలీల సమస్యలతో ఆలస్యం కావడం, సకాలంలో పంట నాటలేక పోవడం తద్వారా పంటనష్టం జరిగేది. దుక్కిదున్నే యంత్రానికి మూడు యూనిట్లు ఉన్నాయి. కొడవలి కలిగిన కోత యూనిట్, నిటారుగా వున్న పంటను వంచి కొడవలి వద్దకు చేర్చే యూనిట్ మరియు యంత్రం యొక్క మధ్య భాగానికి పంటను పోగుచేసే యూనిట్, ఇంకా దీనిపై పరీక్ష పూర్తికాలేదు. కాని దీనిని ఇంకా అభివృద్ధి పరచటానికి ప్రయత్నాలు కొనసాగుతూనే వున్నాయి. శ్రామికుల సహకారంతో ఇటువంటి యంత్రాలను పొందటం గొప్ప విషయం కదా! “ఈరోజుల్లో వ్యవసాయం చేసే పద్ధతి అంతబాగా లేదు, మనలని తృప్తి పరచటానికి వ్యవసాయం చేసే పద్ధతి మార్చాలి” అని భగవాన్‌సింగ్ అంటాడు.

**వరినాటే యంత్రం :**

59 సంవత్సరాల ఫోటోసింగ్ గ్రామీణులకు వైద్య సేవలు అందించేవారు. తను క్లినిక్ ప్రారంభించినప్పటినుంచి వరి పొలాల్లో పనిచేసే కూలీలు భరించలేని వీపు (వెన్ను) నొప్పితో చికిత్సకోసం అతనివద్దకు వచ్చేవారు. నాట్లకు ఉపయోగించేందుకు




మార్కెట్‌లో లభ్యమయ్యే యంత్రం ఖరీదుతో కూడుకున్నదై సన్నకారు రైతులకు అందుబాటులో ఉండేది కాదు. రెండు దశాబ్దాల నిరంతర పరిశోదనల తరువాత మానవశక్తితో వరిని నాటే రెండు రకాల యంత్రాల నమూనాను రూపొందించాడు. 2006-07లో పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని గంగాఘర్ నుండి దౌలా వరకు నిర్వహించిన 18వ శోధయాత్రలో హనీబీనెట్‌వర్క్ వారు ఇతని పరిశోధనను గుర్తించారు. ఈ యంత్రం వెనుకకు,

ముందుకు కదలిక ద్వారా మెకానికల్‌గావెళ్తూ ట్రేలోని వరినారను మళ్ళలో నాటడం జరుగుతుంది. మనదేశంలో సాధారణంగా వరినాట్లు మొత్తం మహిళలే వంగి నాటుతారన్న విషయం తెలిసిందే. ఫొటోసింగ్ కనుగొన్న ఈ నమూనా కేవలం తన భావానికి సాక్ష్యం మాత్రమే.

**ఎండు పోకచెక్కల పైపొట్టును తొలగించే యంత్రం :**

ఉన్నత పాఠశాలలో పనిచేసే 45 సంవత్సరాల నరసింహ భండారి మిరియాలు, పోకచెక్క లాంటి సుగంధ ద్రవ్యాలు పండిస్తుంటాడు. వ్యవసాయ పరికరాలను తయారు చేసే స్వంత వర్క్‌షాప్ కూడా నడుపుతారు. అనేక పర్యాయాలు





పరీక్షలు, పరిశోధనలు నిర్వహించిన తరువాత ఏరకమైన పోకచెక్కకైనా ఉపయోగపడే విధంగా విద్యుత్ సహాయంతో నడిచే పోకచెక్క పైపొట్టును తొలగించే యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ యంత్రంలో పొట్టు తీసే డిస్క్ 2 హెచ్.పి. మోటారుతోను అలాగే తీసిన పొట్టును బయటికి పంపే బ్లోయర్ 1 హెచ్.పి. మోటారుతోను పనిచేస్తాయి. ఈ యంత్రం సామర్థ్యం గంటకు 40 కిలోల పోకచెక్క పొట్టును వలుస్తుంది. అలాగే 90 శాతం పొట్టును తొలగిస్తుంది.

**రవాణాకు సంబంధించినవి :**

**కాళ్ళు సరిగా లేని వారికి అనువైన, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్ :**

ఉన్నత పాఠశాలలో పనిచేసే 35 సంవత్సరాల అస్‌జాద్ భాయ్ ధుక్కా పక్షవాతం వచ్చిన తన తండ్రికోసం మూడు చక్రాల సైకిల్‌ను కనుగొన్నాడు. 24 వోల్టుల బ్యాటరీతో పనిచేసే మోటారు ఇసుక నేలలో సైతం సాధారణ వేగంతో నడుస్తుంది. ఈ మూడు చక్రాల సైకిల్ తక్కువ ఎత్తు ఉండి అవసరానికి అనుగుణంగా సీటు వెనుకకు, ముందుకు సరిచేసుకునే సౌకర్యం కూడా వుంది. వార్తా పత్రికలు, నీళ్ళ సీసా మొదలైనవి ఉంచుకునే ఏర్పాటు, ఫ్యాను, వాలు ప్రాంతాల్లో సైకిల్ వెనుకకు వెళ్ళకుండా



లాకింగ్ సిస్టమ్ మొదలైన సదుపాయాలతో రూపొందించబడింది. అలాగే సీటుపైకి సునాయాసంగా ఎక్కే ఏర్పాటు, ముందుకు మాత్రమే వెళ్ళేందుకు తగినంత బ్రేక్ విధానం దీని ప్రత్యేకతలు. కాబట్టి ఈ సైకిల్ ఎక్కేటప్పుడు వెనుకకు వెళ్ళిపోతుంది అన్న భయం లేకుండా ఎక్కవచ్చు.

అలాగే కోళ్ళ ఫారాలలో ఆహారాన్ని పొడిచేసే పరికరాల రూపకల్పన, మసీదులలో సాంప్రదాయ గోపురాల నిర్మాణం ఇతని పరిశోధనలలో మరికొన్ని.

**గేర్లు పనిచేయడంలో సరిక్రొత్త సాంకేతిక విధానం :**

నిశాంత్ రాయ్ 26 సంవత్సరాల పట్టభద్రుడు. బాల్యం నుండే ఇతనికి పుస్తక పఠనం పట్ల మక్కువ ఎక్కువ. సైన్సు జర్నల్స్‌ను పరిశోధించేవాడు. ఎత్తు పల్లాలు ఉన్న రోడ్లపై అలాగే ఎత్తుకు ఎక్కే కొండ ప్రాంతాల్లో, ఒడిదుడుకులుగా ఉన్న పీఠ భూముల్లో ఎక్కువ బరువుతో రిక్షాను తొక్కేవాళ్ళు పడే బాధ అతని హృదయాన్ని కలచివేసింది. నిశాంత్ పరిశోధించి కనుగొన్న ఈ నూతన గేర్ సాంకేతిక విధానం మూలంగా వెనుకకు పెడలింగ్ చేయడం ద్వారా శ్రమను తగ్గించి, రిక్షాను ముందుకు నడిపేందుకు దోహదపడింది. వాలు ప్రాంతాలలో రిక్షా వెనుకకు వెళ్ళిపోకుండా కూడా ఇది నియంత్రిస్తుంది.




2007లో ఈ యంత్రంపై నిశాంత్ రాయ్‌కి

పేటెంట్ ఇప్పించేందుకు ఎన్.ఐ.ఎఫ్. దరఖాస్తు చేసింది. బిట్, మిశ్రా లలో ఈ పరికరం నమూనాను పరిక్షించి, దీని పనివిధానం సంతృప్తికరంగా ఉందని నిర్ధారించేందుకు కూడా ఎన్.ఐ.ఎఫ్. తగు ఏర్పాట్లు చేసింది. ఇదేకాక, తక్కువ ఖర్చుతో కూడుకున్న వాటర్ ఫిల్టర్, బకెట్‌లో బిగించి బ్యాటరీతో నడిచే బట్టలుతికే యంత్రం నిశాంత్ ఇతర పరిశోధనలు. "అన్ని దారులు ఒకే గమ్యానికి చేరవచ్చు కాని, గమ్యం ప్రాధాన్యతగా కాక, ప్రయాణం ప్రాముఖ్యతను, ప్రయాణ అనుభూతిని పొందగలిగే దారిని ఎంపిక చేసుకోవడమే విజ్ఞుల లక్షణం" అంటారు నిశాంత్.

**సంచిలో మోసుకువెళ్ళే సైకిల్ :**

24 సంవత్సరాల సందీప్ కుమార్ పట్టభద్రుడు. ఆత్మస్థయిర్యంతో కష్టపడి పనిచేయటం ఇతని స్వభావం. తక్కువ సమయంలో తేలికగా మడిచి సంచిలో పెట్టుకొని ఎక్కడికైనా తీసుకువెళ్ళగలిగే సైకిల్‌ను రూపొందించాడు సందీప్. అంగవికలుడైన సందీప్ విద్యార్థి దశలోనే దీనిని కనుగొన్నాడు. తను తన పాఠశాలకు అలాగే ఇతర ప్రాంతాలకు ఎక్కువగా తిరిగేటప్పుడు రోడ్లపై ప్రయాణం అతనికి ఎంతో ఇబ్బందిగా వుండేది. బస్సులు తక్కువగా అందటం, ఆ బస్సులలో ఎక్కువ రద్దీ మూలంగా సందీప్‌కు కష్టంగా అందేది. మడత సైకిలు తయారు చేయాలి అన్న అతని సంకల్పానికి అతని అక్క ప్రోత్సహించింది. ఈ మడత సైకిలు ధర సుమారుగా రూ. 3,000/- వరకు వుంటుంది. కాని వీటిని ఎక్కువ సంఖ్యలో



తయారు చేసినట్లయితే సుమారు రూ. 2 వేల నుండి రూ. 2,200/- వరకు తగ్గించవచ్చు. ఈ సైకిలుకు తనపేరు, తన అక్కపేరు కలిసి వచ్చేలా "సందిశ్మ" అని నామకరణం చేశాడు సందీప్. చేతి కర్ర ఆధారంగా నడిచే సందీప్ ఇంటినుంచి బయటికి వెళ్ళేటపుడు అతన్ని పట్ల ఎవరూ సానుభూతి చూపనక్కర్లేదు. ఎందుకంటే అతనివెంట "సందిశ్మ" సైకిలు వుంటుంది. ఈ విషయంలో సందీప్ దుష్యంతుని పలుకులు గుర్తు చేసుకుంటాడు. "ఆకాశానికి చిల్లు పడదు అని ఎందుకు అనుకుంటావు. నీ శక్తినంతా ఉపయోగించి ఒక రాయి విసిరి చూడు". అంటే సృష్టిలో అసాధ్యమైంది ఏదీలేదు - అనేది అతని పట్టుదల. పరిజ్ఞానం వుంటే ఏదైనా సాధించవచ్చు అనేది దీనర్థం.

**ఉమ్మడి పురస్కారాలు - మొక్కల సంరక్షణ :**

**కీర్‌జాలు వారిచే సాంప్రదాయమైన గుండ్రటి సార జాతి పంట సంరక్షణ :**

జైపూర్‌లో "బన్‌గానా" నది ఒడ్డున విరాట్‌నగర్ తహసీలు పరిధిలోని ఒక గ్రామం వెలుపల ఈ కీర్‌జాతి ప్రజలు నివాసముంటారు. ఈ తెగవారు సుమారు గత 35 సంవత్సరాలుగా గుండ్రటి సార జాతి పంటను సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తూ దానిన సంరక్షిస్తున్నారు. ఈ తెగవారిలో వ్యవసాయం చేయడంలో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషిస్తారు. ఈరకం సార జాతిపంటను సంరక్షింకోవడంలో భాగంగా ముదురు ఆకుపచ్చ రంగులో పైన నూగుగా వుండే పెద్దపెద్ద కాయలను విత్తనాలకు ఉపయోగిస్తారు. వీటిని విత్తేటపుడు సుమారు 100 గ్రా. నుండి 200 గ్రా. బబరువుతో గుండ్రంగా చక్కని రుచి కలిగి వుంటాయి. ఇతర వాణిజ్య పంటల కంటే ఈ జాతి నాణ్యతాపరంగా బాగుంది. అధిక దిగుబడినిస్తాయి. జైపూర్ పరిసర ప్రాంతాల్లో "సాహపూర్ టండా" అని ఈ జాతి ప్రసిద్ధి.





# మన ఔషధ మొక్కలు

- జట్టు ట్రస్టు సౌజన్యంతో....

## ఉసిరి

**ఇతర పేర్లు :** ఆమ్లకి

**దొరుకు చోటు :** అడవులలో, తోటలలో, ఇండ్ల పెరడులలో

**ఉపయోగపడు భాగాలు :** కాయలు, ఆకులు, బెరడు, పూవులు, గింజలు.

**మొక్క ఆకారము :** 10-154 మీటర్ల వృక్షం.

**ఆకులు :** రెమ్మవంటి చిన్న కొమ్మలపై వచ్చి దీర్ఘ చతురస్రాకారంలో ఉంటాయి.

**పూలు :** స్త్రీ పురుష, పుష్పాలు చిన్నవిగా, లేతాకుపచ్చ ర,గులో కొమ్మలపై వస్తాయి.



**కాయలు :** ఆకుపచ్చ ఛాయ కలిగిన పసుపు రంగుతో నిలుపు చారలతో ఉంటాయి.


**ఉపయోగాలు :** తాజా కాయలనుండి "సి" విటమిన్ అధికముగా లభిస్తుంది. కాయల గుజ్జు మూత్రవర్ధకము, విరేచనకారి. ఉసిరి త్రిఫలాలలో ఒకటి. ఉసిరికాయ కఫ, వాత, పిత్తాలను పోగొడుతుంది. వీర్యవృద్ధి కలిగిస్తుంది, మెదడును చల్లబరుస్తుంది. పచ్చి ఉసిరికాయల రసం 50 గ్రా. తీసుకుని పటిక పంచదారతో రెండుపూటలా తీసుకుంటే మూత్రవ్యాధులు తొలగిపోతాయి. ఉసిరి, తాని, కరక్కాయ గుజ్జును సమంగా తీసుకొని పొడిచేసి రోజూ రాత్రి నిద్రపోయేముందు చెంచాడు వంతున సేవిస్తే మలబద్ధకం తొలగిపోతుంది. ఆకలి పెరుగుతుంది. ఉసిరిక గుజ్జు బియ్యం కడుగుతో మెత్తగా నూరి తలకు పట్టించి, ఒక గంట తర్వాత స్నానం చేస్తే తలదిమ్ము, తలనొప్పి తొలగిపోతాయి. నిత్యం సేవిస్తే యౌవ్వనాన్ని కాపాడుతుంది.

## ఈశ్వరి

**ఇతర పేర్లు :** ఈశ్వరీమూ, నల్ల ఈశ్వరి, నాగసరం

**దొరుకు చోటు :** చిట్టడవుల్లో

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, వ్రేళ్ళు.



**మొక్క ఆకారము :** 6 మీటర్ల ఎత్తు పెరుగు బహువార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు ఒకటి చొప్పున ఇంచుమించు దీర్ఘచతురస్రాకారంలో చివర భాగంలో కొంచెం వెడల్పుగాను, కొనసూదిగా ఉంటాయి.

**పూలు :** ఆకర్షణ పత్రాలు ఆకుపచ్చ ఛాయకల వంగపండు రంగులో ఉంటాయి.

**కాయలు :** గుండ్రంగా ఉండి, బద్దలైతే ఉట్టి (విచ్చుకొని తిరగబడిన గొడుగు ఆకారంలో) లాగా ఉంటాయి.

**ఉపయోగాలు :** నల్ల ఈశ్వరి వేళ్ళు చర్మవ్యాధులను నయం చేయడానికి జ్వరాలు తగ్గించడానికి ఉపయోగపడతాయి. శుభ్రపరచిన నల్ల ఈశ్వరి వ్రేళ్ళనూ, ఆకులను సమాన తూకంలో తీసుకొని ముద్దచేసి, రోజూ మూడుపూటలూ పూటకు అరచెంచా వంతున వారం రోజులు తీసుకుంటే కోరింత దగ్గునుండి ఉపశమనం పొందవచ్చు. వేరుముద్దనూ, ఆకుల రసాన్ని పాముకాటు చికిత్సలో ఉపయోగిస్తారు.

## కరక

**ఇతర పేర్లు :** కరక్కాయ, హరీతకీ

**దొరుకు చోటు :** అడవులు, చేలగట్లు.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు

**మొక్క ఆకారము :** 6-15 మీటర్ల ఎత్తు పెరుగు చెట్టు

**ఆకులు :** కణుపుకు ఒకటి లేక రెండు కోలగా ఉంటాయి.

**పూలు :** లేత ఆకుపచ్చ రంగులో కంకులపై నక్షత్రాలవలె వస్తాయి.

**ఫలాలు :** కోలగా ఉండి, ఎండినపుడు నొక్కులు ఏర్పడతాయి.



అక్టోబర్ నుండి జనవరి వరకు దొరుకుతాయి.

**ఉపయోగాలు :** త్రిఫలాలలో ఒకటి. శ్వాస, గుండెజబ్బులకు పనిచేస్తుంది. విరేచనకారి, జీర్ణాశయాన్ని క్రమపరుస్తుంది. కడుపులోని వాయువులు క్రమంగా తగ్గిపోతాయి. కరక్కాయ బయటి తొక్కను గుండచేసి, చెంచాడు చొప్పున అరగ్లాసుడు నీటిలో, చిటికెడు ఉప్పుతో కలిపి నిద్రపోయేముందు 15 రోజులపాటు త్రాగితే విరేచన మందం తగ్గిస్తుంది. కరకపొడి రెండు గ్రాములు తగినంత వెన్నతో కలిపి నోటికి పట్టిస్తే నోటిపూత తగ్గుతుంది. కరక్కాయ సన్నని సెగలో వేగపెట్టి, చల్లార్చి పొడిచేసి, రోజూ వుదయం రెండేసి చెంచాలు అరగ్లాసుడు నీళ్లలో కలిపి త్రాగితే 40 రోజుల్లో చక్కెర వ్యాధి అదుపులోకి వస్తుంది.

## కలబంద

**ఇతర పేర్లు :** ఘృత, కుమారీ, కన్యా, అలోవీర

**దొరుకు చోటు :** చిట్టడవులలో, తోటలలో, గట్లపై పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** బాకులవంటి ఆకులు.

**ఆకులు :** బలంగా, జిగటగానున్న గుజ్జుతో, అంచులకు ముండ్లలాంటి దంతాలతో 50 సెం.మీ. వరకు పెరిగి బాకులవలె ఉంటాయి.



**పూలు :** కమలాపండు పసుపు రంగులో, ఒకమీటరు వరకు పొడవుగల కాడమీద గొట్టాలవలె వ్రేలాడుతూ ఉంటాయి.

**ఉపయోగాలు :** ఆకు చలువ చేస్తుంది. చల్లదనాన్నిస్తుంది. వీర్య పటుత్వము కలిగిస్తుంది. కలబంద ఆకు రసము చెంచాడు వంతున ఒక గ్లాసు పాలలో కొంచెం పంచదార చేర్చుకొని, రెండుపూటలా భోజనానికి గంట ముందు సేవిస్తే ప్రేవుల పూత, పుండ్లనుండి ఉపశమనం కలుగుతుంది. కలబంద ఆకుల గుజ్జును, తగు పంచదారను చేర్చి పూటకు 10 గ్రాముల చొప్పున రెండుపూటలా సేవిస్తే 40 రోజులకు సుఖరోగం నుండి ఉపశమనం దొరుకుతుంది. ఋతుక్రమాన్ని క్రమబద్ధం చేస్తుంది. కలబంద గుజ్జు తలపై పట్టిస్తే తలనొప్పి, చుండ్రు తగ్గి, చలువ చేస్తుంది. కండ్లమంటలు తగ్గిస్తుంది.

## కాకర

**ఇతర పేర్లు :** కారవేల్లక, కారవేల్లీ.

**దొరుకు చోటు :** కూరగాయలుగా పెంచుతారు. ఎవరూ పెంచకుండానే పొదలలో పెరుగుతుంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, కాయలు



**మొక్క ఆకారము :** 5-6 మీటర్లు పెరిగే బహువార్షికమైన పాదు.

**ఆకులు :** కణుపుకు ఒకటి చొప్పున చేయి ఆకారంలో ఐదు లేక ఏడు భాగాలుగా విభజింపబడి ఉంటాయి. ప్రతిభాగం అంచులకు దంతాలవంటి నొక్కులు ఉంటాయి. ఆకు మొదలులో ఒక నూలితీగ బయలుదేరి ఎగబాకటానికి సహాయపడుతుంది.

**పూలు :** స్త్రీ, పురుష పూలు పసుపు రంగులో వుంటాయి.

**కాయలు :** లేతగా ఉన్నప్పుడు తెల్లగా, పండినపుడు పసుపు రంగులోనూ, కుంభ కటకాకారంలో ఉంటాయి. కాయలకు నిలువు గీతలతో వున్న ముక్కోణపు బొడిపలు ఉంటాయి. విత్తనాలు ఎర్రని కంతడో కప్పబడి ఉంటాయి.


**ఉపయోగాలు :** కాకర ఆకులు, కాయలు, క్రిములను, జ్వరాలను పోగొట్టి, జీర్ణశక్తిని పెంచుతాయి. మధుమేహాన్ని అదుపులో వుంచుతాయి. నాలుగు చెంచాలు కాకర కాయల రసం ప్రతిరోజూ ఉదయం 40 రోజులు తీసుకుంటే మధుమేహం అదుపులో వుంటుంది. కాకర ఆకులను ముద్దచేసి కందిగింజ పరిమాణంలో మాత్రలుగా చుట్టుకొని పూటకు ఒకటి చొప్పున రెండుపూటలా 40 రోజులపాటు తీసుకుంటే అధికరక్తపు పోటు అదుపులోకి వస్తుంది.

## గాడిదగడప

**ఇతర పేర్లు :** కీటమారి, ధూమ్రపత్ర

**దొరుకు చోటు :** కలుపు మొక్కలా, పొలంగట్లపైనా, రేగడి మట్టిలోనూ పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు



**మొక్క ఆకారము :** 30 సెం.మీ. నుండి ఒక మీటరు వరకు నేలపై పాకే బహువార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు ఒకటి చొప్పున వెడల్పుగ, హృదయాకారంలో బూడిదపూసిన రంగులో వుంటాయి.

**పూలు :** దాదాపు వంగపండు రంగులో లోపలికి చిన్న కీటకాలు వెళితే బయటకు రావటానికి వీలు లేకుండా, నూగు అమర్చబడిన గొట్టం బోనులా వుంటుంది.

**కాయలు :** గుండ్రంగా, బద్దలైతే ఉట్టి ఆకారంలో ఉంటాయి.

**ఉపయోగాలు :** గాడిదగడప ఆకులు పది తీసుకుని 4 మిరియాలు చేర్చి మెత్తగా నూరి పరగడుపున సేవిస్తే ముట్టునొప్పి తగ్గుతుంది. ఆకు మెత్తగా నూరి, తగు మోతాదులో కస్తూరి పసుపు మిరియాలతో కలిపి, ఆవు మూత్రంతో నూరి ఆ ముద్దను తగినంత ఆముదములో ఉడికించగా వచ్చిన నూనెను గ్రహించి పైపూతగా వాడిన సోరియాసిస్ హరించిపోతుంది. పిల్లల కడుపులో చేరిన నులిపురుగులను తొలగించడానికి దీని ఆకులు నూరి బొడ్డుచుట్టూ పూస్తారు.

# గుంటగలగర

**ఇతర పేర్లు :** భృంగరాజు

**దొరుకు చోటు :** నీటి గుంటల ప్రక్కన

**ఉపయోగపడు భాగాలు :** సమూలంగా

**మొక్క ఆకారము :** నేలబారుగాగాని, నిటారుగాగాని, నీరున్న స్థలాలలో 50 సెం.మీ. పెరిగే ఏకవార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు రెండు గరకుగా ఉంటాయి.


**పూలు :** తెల్లగా గుండ్రంగా పళ్ళెంలాగా ఏర్పడి ఒక కాడపై వస్తాయి.



**కాయలు :** 3 కోణాలతో చిన్న గింజలవలె ఉంటాయి. అక్టోబర్ నుండి మార్చి వరకు దొరుకుతుంది.

**ఉపయోగాలు :** దీని ఆకులను దంచగా వచ్చిన రసం పూర్తే కొన్నాళ్ళకు వాపు తగ్గుతుంది. 5 గుంటగలగర ఆకులను దంచి, చిటికెడు మిరియాల పొడితో కలిపి ముద్దగా చేసి, పరగడుపున 15 రోజులు తీసుకుంటే జ్వరం తగ్గుతుంది. పాండురోగం హరించిపోతుంది. గుంటగలగరాకు నీడిలో ఎండించి, పొడిచేసి, జల్లించి, పావు స్పూను పొడికి రెండు చెంచాల తేనె కలిపి, రెండు పూటలా వారం రోజులపాటు సేవిస్తే ఉదరకోశ వ్యాధులు హరించుకుపోతాయి. గుంటగలగరాకుతో చేసిన తైలం వాడితే జుత్తు నల్లగా మృదువుగా వుంటుంది. గుంటగలగర కషాయం పచ్చకామెర్లను తగ్గిస్తుంది.

**(వచ్చే సంచికలో మరికొన్ని ఔషధ మొక్కల గురించి....)**



# సైకిల్ వాహకులకు శుభవార్త
# వెంకటేశ్వర్లు ఇన్నోవేషన్ "యాంత్రిక సైకిల్"


సైకిల్ జనసామాన్యానికి ఎంతో ప్రాధాన్యమైన రవాణా యంత్రం. ఆసియాలోని దేశాలన్నీ సైకిల్‌ను విరివిగా వాడతాయి. భారతదేశంతో పాటు చైనా, జపాన్, కొరియా, బంగ్లాదేశ్ లాంటి దేశాలన్నీసైకిల్‌ను ఆర్థికాభివృద్ధికి సంకేతంగా వర్ణించేవారు.

గ్రామాల్లో, పట్టణాల్లో చిన్న చిన్న వ్యాపారస్తులకు, సామాన్యులకు సైకిల్ ఓ ఆపద్బంధువు లాంటిది. పయనించటానికి, సరుకులు, వస్తువులు రవాణా చేయటానికి, వ్యవసాయ పనులకు మొదలైన వాటన్నిటికి సైకిల్ ఎంతో అనువైనది.

రైతులు, గ్రామీణ శాస్త్రవేత్తలు సైకిల్‌తో పనిచేసే వ్యవసాయం, నీటి పారుదల, కరెంటు ఉత్పత్తి లాంటి దాదాపు 30 రకాల ఇన్నోవేషన్లను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' వెలికి తీసింది.

సైకిల్ పేదవాడి రవాణా సాధనంగా ఇంకా విరివిగా వాడకంలో వుంది. అయితే సైకిల్ తొక్కటానికి శారీర దారుఢ్యం, తగిన శక్తి అవసరం. అది లేనినాడు సైకిల్ మనిషికి భారం అవుతుంది. వయసుమీరినవారు సైకిల్ నడపటం అంత సులభం కాదు. దూరాలు నడవటం కూడా కష్టమే. స్కూటర్లు, మోటార్ సైకిళ్ళు కొనే ఆర్థిక పరిస్థితి చాలా మందికి లేదు. అలాంటి






వారి కష్టాల నివారణకై ఓ గ్రామీణ మెకానిక్ నడుం కట్టాడు.

రెండు (2) హార్స్‌పవర్ ఇంజన్‌ని సైకిల్‌కు అమర్చాడు. దాంతో సైకిల్ 30 కి.మీ. వేగంతో పెడలింగ్ అవసరం లేకుండా రోడ్లపై పరుగెడుతోంది. చిన్న ఇంధనపు ట్యాంకు (ఒక లీటర్‌ది), స్టార్టర్, వైర్లు, ఎక్స్‌లేటర్ అన్నీ అమర్చాడు. సైకిల్‌కు ఎలాంటి ఇతర మార్పులు చేయకుండానే హాయిగా దాన్ని ఉపయోగించు కోవచ్చు.

ఈ యాంత్రిక సైకిల్ పెద్ద వయసు వారికి, ఎక్కువ లగేజిని సైకిల్‌పై తీసుకువెళ్ళే వారికి, గమ్యానికి త్వరగా చేరాలనుకునే వారికి ఎంతో ఉపయుక్తంగా వుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు. సైకిల్‌ను యాంత్రికంగా మార్చడానికి దాదాపు 5 వేల రూపాయలు ఖర్చవుతుంది. ఇందులో సైకిల్ ధర లేదు.

వెంకటేశ్వర్లు ఒక సాధారణ వ్యక్తి, కూలీ నాలీ చేసుకుని జీవితం కొనసాగిస్తుంటాడు. తన స్వల్ప ఆదాయంలో కొంత వెనకేసి, సమాజ క్షేమానికై ఈ ప్రయోగాన్ని చేసి విజయం సాధించాడు. అతనికి మా అభినందనలు. హనీబీఎపి ఈ ఇన్నోవేషన్‌ను పరీక్షించి, ఎన్.ఐ.ఎఫ్.లో రిజిస్టర్ చేయించింది. ఈ యాంత్రిక సైకిల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావటానికి ప్రయత్నాలు మొదలెట్టింది. త్వరలోనే ఈ యాంత్రిక సైకిల్ సమాజంలోని ఎంతోమంది సైకిల్ వాడుతున్న వ్యక్తులకు అలసటను తీర్చి సుఖాన్ని అందజేస్తుందని ఆశిద్దాం.

మీ సైకిళ్ళను యాంత్రిక సైకిల్‌గా మార్చాలనుకుంటే హైదరాబాద్ లోని "క్రియేటివ్ మైండ్స్" సంస్థలో శ్రీ వీరరాఘవ రెడ్డిని ఫోన్ నెం. 040-27665655 పై సంప్రదించండి. లేదా హనీబీఎపిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోండి.

# చైనాలో ఆసక్తికర ఇన్నోవేషన్లు

**కరెంటుతో నడిచే నడిచే చిన్నకారు :**

చైనాలోని శాంగ్ ల్యూ నగరానికి చెందిన 'గ్వా సు జున్' అనే 53 సంవత్సరాల వ్యవసాయదారుడు కరెంటుతో నడిచే చిన్న కారును రూపొందించాడు. చైనా కరెన్సీలో 3500 ఎన్‌లు ఖరీదు చేసే ఈ కారు రెండుమీటర్ల పొడవు, ఒక మీటరు ఎత్తు వుంటుంది. ఈ వాహనం గంటకి 40 నుండి 50 కి.మీ. వేగంతో ప్రయాణించవచ్చు.



**సైకిల్ నాగలి :**

చైనాలోని బీజింగ్‌కు చెందిన మియూన్ కౌంటీలో 'వాంగ్ ఫ్యూ' ఆసక్తికరంగా సైకిల్ విడిభాగాలను ఉపయోగించి భూమిని దున్నటానికి ఒక నాగలిని తయారు చేశాడు. ఇది గతంలో 'పల్లెసృజన' పత్రిలో ప్రచురించిన నాగలికన్నా ఎంతో భిన్నంగా వుంటుంది.



**మెట్లెక్కే మోటార్ సైకిల్ :**



చైనా లోని ట్యాంజిన్‌కు చెందిన 'చెన్ గ్జువి' అనే అతను మెట్లు ఎక్కే ఈ మోటార్ సైకిల్‌ను తయారు చేశాడు. ముందు చక్రంతో నడిచే ఈ మోటార్ సైకిల్ లో ఎక్కువ శక్తి ఉత్పన్నమవుతుంది కనుక దీని సహాయంతో మెట్లు కూడా ఎక్కవచ్చు.

**కొత్తరకం ఎలుకల బోను :**

చైనా, గ్వున్‌జూలోని గ్జున్‌హుయ్‌కి చెందిన 'ఫెంగ్ వెంజు' అనే 69 సంవత్సరాల వృత్తిరీత్యా ఎలుకల్ని పడతాడు. తను ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత ఈ కొత్తరకం ఎలుకల బోనును రూపొందించాడు. రింగు ఆకారం లో వుండే ఈ బోను వాడటానికి చాలా సులభంగా వుంటుంది. కానీ, చాలా బాగా పనిచేస్తుంది. రింగులోకి ఎలుక వచ్చిన వెంటనే ఆ రింగు బిగుసుకు పోవటం వల్ల బయటకు వెళ్ళే అవకాశం లేక ఊపిరాడక చనిపోతుంది.



# గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక










## పల్లెజ్ఞానాన్ని వ్యాపింపజేద్దాం - పల్లెసృజన ను బహూకరిద్దాం

### మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి పల్లెసృజన

- మీ నాన్నగారి పుట్టినరోజా?
- మీ స్నేహితుడి పెళ్ళా?
- మీ చిరంజీవి బర్త్‌డేనా?
- మీ సహోద్యోగి రిటైరవుతున్నారా?
- మీ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారా?
- మీ పెళ్ళిరోజా?

పెళ్ళైనా, పండగైనా, స్కూళ్ళు కాలేజిలో చేరినా..... సందర్భం ఏదైనా ఆచారం సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇవ్వాలి.... దానికెంత ఖర్చు చేయాలి?.... అసలు బహుమతి ఏమివ్వాలి?... అనేది ఎప్పుడూ ఓ పెద్ద సమస్యే....

- ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా...
- అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా ....
- జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేదిగా ఉండాలంటే.....?

ఇచ్చినవారికే కాక, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. మీరో పదిమంది మిత్రులకు కాని, శ్రేయోభిలాషులకు గాని పల్లెసృజన పత్రికను 'గిఫ్ట్'గా ఇవ్వాలంటే వారి పేరు, అడ్రస్‌ను వ్రాసి, రూ. 1,500/–లను పంపితే మీరు పంపిన చిరునామాలకు మీ గిఫ్ట్‌గా, మీ పేరున వారికి పంపుతాం. అంటే మీరు ఒక సంవత్సరం పాటు వారికి గిఫ్ట్ ఇచ్చినట్లవుతుంది. ప్రతి సంచిక వచ్చినప్పుడల్లా మమ్మిల్ని జ్ఞాపకం చేసుకుంటారు.

పల్లెసృజన పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగున్న విజ్ఞాన సంపదని వెలికి తీసి ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటుపడుతోంది.

మీరు బహుమతి ఇవ్వదలచుకున్న ప్రతి సందర్భంలో తడుముకోవలసిన అవసరం లేకుండా ఇవ్వదలచుకున్న వారి పేరు, పూర్తి చిరునామాలతో పాటు ఎంతమందికి బహుమతి ఇవ్వాలనుకున్నారో అన్ని రూ. 150/–లు మాకు పంపిస్తే మేము మీ తరుపున వారికి ఒక సంవత్సరం పాటు పల్లెసృజన పత్రికను పంపుతాం.

- ఎడిటర్

# ఇక కరెంటు 'షాక్' కొట్టదు తెలుసా?

నికల్సన్ కె. సింగ్ గారి 'ఎలక్ట్రిక్ షాక్ ప్రూఫ్ కన్వర్టర్' వాడితే కరెంటు షాకు కొట్టినా పెద్ద ప్రమాదం జరుగకుండా చిన్నపాటి గాయం కాని, కాలటం కాని జరుగుతుంది. సింగ్ తయారు చేసిన ఈ పరికరం సాధారణ విద్యుత్తును 'షాక్' కొట్టని విద్యుత్తుగా మార్చగలదు. దీనిని ఇళ్ళల్లో కరెంటు మీటరు ప్రక్కన లేదా మెయిన్ ఫ్యూజ్ దగ్గర కానీ అమర్చితే ఇంట్లోకి ప్రసారమయ్యే కరెంటు వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగవు. దీనివల్ల ఇళ్ళల్లో తెగిపోయిన వైర్లు తాకినా, స్విచ్‌లలోకాని, ఎలక్ట్రిక్ వస్తువులలో కానీ కరెంటు ప్రసారం జరుగుతున్నా వాటిని తాకటం వలన ప్రమాదకరమైన షాకు కొట్టకుండా కేవలం చిన్నపాటి గాయంతో సరిపెడుతుంది.

ఈ పరికరం ఇళ్ళల్లో, వాణిజ్య స్థలాల్లో బహు ఉపయోగకారిగా ఉంటుంది. సాధారణంగా మార్కెట్‌లో సేఫ్టీ స్విచెస్ దొరుకుతాయి. కానీ ఈ పరికరం వలన ఎవరికైనా షాక్ కొడితే వెంటనే కరెంటు సిస్టంని ఇది ఆపేస్తుంది. మరలా కరెంటును ఒక స్విచ్ ఆన్ చేయటం ద్వారా పనిని ప్రారంభించుకోవచ్చు. దీని ఖరీదు దాదాపు రూ. 5,000/–లు వుంటుంది. దీనిని తయారు చేయటానికి సింగ్ గారు 'డి.ఐ.ఓ.పి.ఇ.', ట్రాన్సిస్టర్, రెసిస్టెన్స్, ఇండక్టెన్స్, మెటల్ ఆక్సైడ్ వెరిస్టర్ (యం.ఓ.వి.), ట్రాన్స్‌ఫార్మర్, రైలీ వాల్ట్ మీటర్, అమ్మీటర్, ఎల్.ఇ.ఓ., సాకెట్, ఎర్తింగ్‌లను వినియోగించాడు.

ఈ పరికరం వినియోగించటం వల్ల షాక్ కొడుతుందేమోనన్న భయం లేకుండా ఇంట్లో కరెంటు పనులను యథావిధిగా చేసుకోవచ్చు. ఈ విధంగా ఇది మార్కెట్‌లో దొరికే సేఫ్టీ స్విచ్‌లకన్నా భిన్నమైనది, మెరుగైనది. మొత్తం గృహానికి ఒక్క పరికరం చాలు.




**కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :**

**National Co-ordinator, Business Development,**
**National Innovation Foundation,**
Banglow No. 1, Satellite Complex, Jodhpur Tekra, Premchand Nagar Road,
Ahmedabad - 380 015.
Ph. : 91-79-26732095 / 456, Fax : 91-79-26731903.
E_mail : bd@nifindia.org
Website : www.nifindia.org/bd.

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక


**రూ. 20/-లు మాత్రమే!**



సంపుటి 1, సంచిక 1


సంపుటి 1, సంచిక 2



సంపుటి 1, సంచిక 3



సంపుటి 1, సంచిక 4



సంపుటి 2, సంచిక 1



సంపుటి 2, సంచిక 2


సంపుటి 2, సంచిక 3


సంపుటి 2, సంచిక 4


సంపుటి 3, సంచిక 1


సంపుటి 3, సంచిక 2


సంపుటి 3, సంచిక 3


సంపుటి 3, సంచిక 4


సంపుటి 4, సంచిక 1


సంపుటి 4, సంచిక 2


సంపుటి 4, సంచిక 3

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 1,500/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 2,500/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 3,750/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 6,500/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Aruna Ganesham, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
A/c No. 905 520 100 773 62

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్ (ఓపియస్‌డిహెచ్)

# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

## శబ్దం బాబోయ్ శబ్దం :

- ❀ శబ్దం కూడా చాలా ఇబ్బందులను కలిగిస్తుంది.
- ❀ అసలు శబ్దం చేయకుండా ఎలా బతకడం అని మనలో కొందరయినా అనుకుంటారు.
- ❀ పండుగలు, పెళ్ళిళ్ళు, ఎన్నికల సంబరాలు, ఆఖరుకు దహన సంస్కారాలు కూడా శబ్దంతో జరుపుకోవడం మనకు అలవాటయింది.
- ❀ 20వ శతాబ్దాన్ని శబ్ద శతాబ్దం అన్నారు శాస్త్రవేత్తలు.
- ❀ శబ్దం చేయడం తమ జన్మహక్కు అని కొందరు అనుకుం టారు. అయితే వారి చుట్టూ వుండే వారికి శబ్దం ఆరోగ్య సమస్య కావచ్చు. ఆరోగ్యంగా జీవించడం ప్రతిఒక్కరి హక్కు.
- ❀ అధిక శబ్దం వల్ల కొందరు రోగులకు "పిట్స్" రావచ్చు.
- ❀ శబ్దం వల్ల గుండెజబ్బులవారు గుండె ఆగి గుటుక్కు మనవచ్చు.
- ❀ వాహనాలు వాడేవారు 'సైలెన్సర్లు' విధిగా వాడాలి. అనవసరంగా హారన్లు మోగించరాదు.
- ❀ మీ రేడియోలు, టి.వి.లు, లౌడ్ స్పీకర్లు మీకే పరిమితం చేసుకోండి. ఉచిత వినోదం సమాజానికి ఇవ్వకండి.
- ❀ చెట్లు పెంచండి – శబ్దాన్ని తగ్గించండి.
- ❀ "హాయ్ – హాయ్ – శబ్దం లేదు, చెవులు మూసుకోవాల్సిన పనిలేదు" అనే చల్లని రోజుకై ఎదురు చూద్దాం.

## ఆరోగ్య రక్షణలో అయోడిన్ :

- ❀ 21–10–2010 – ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల దినం.
- ❀ అయోడిన్ ఒక మూలకం, ఉప్పు, కొన్ని కూరగాయలు, సముద్రం నుండి లభించే కొన్ని ఆహార పదార్థాలలో అయోడిన్ ఉంటుంది.
- ❀ మనదేశంలో ప్రతి 5 మందిలో ఒకరు ఏదో ఒక స్థాయి అయోడిన్ లోపంతో బాధపడుతున్నారు.
- ❀ మనం గొంతుపై బంతిలాంటి గడ్డ ఉన్నవారిని చూస్తుం టాము. దీనిని గాయిటర్ అంటారు. ఈ గడ్డకు కారణం అయోడిన్ లోపమే.
- ❀ మనం సర్కస్ కంపెనీలలో మరుగుజ్జులను చూస్తుంటాము. తల్లికి గర్భధారణ సమయంలో అయోడిన్ లోపముంటే – పిల్లలు తెలివి తక్కువతో, చెవుడు, మూగ, మెల్లకన్ను సమస్యలతో పుట్టవచ్చు.
- ❀ అయోడిన్ లోపముండే గర్భవతులలో గర్భస్రావాలు చాలా ఎక్కువ.
- ❀ మనకు రోజూ కావలసిన అయోడిన్ 150 మైక్రోగ్రాములు. అంటే గుండుసూది తలపై పెట్టేంత మాత్రమే. ఈ లెక్కన జీవితాంతం ఒక స్పూను అయితే సరిపోతుంది.
- ❀ కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలలో అయోడిన్ లోపం ఎక్కువ.
- ❀ ఇప్పుడు అయోడిన్ కలిసిన ఉప్పు ప్రతిచోటా లభిస్తుంది.
- ❀ అయోడిన్ కలిసిన ఉప్పునే వాడండి. భావితరాలు చురుకుగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండేలా చూడండి.

ఈ అంశాలను మీ స్నేహితులతో, బంధువులతో, సహచరులతో మాట్లాడండి.

**– సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ – ఓపియస్‌డిహెచ్.**

గతంలో ఈ శీర్షికలో చెప్పిన విధంగా ఎవరైనా 'ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి' హెల్త్ బోర్డులను నిర్వహించ వలసిందిగా ఒంపియస్‌డిహెచ్ నిర్వాహకులు డా. అరవీటి రామ యోగయ్య గారు కోరినట్లుగా పాఠకులు ఎవరైనా ఈ బోర్డులను నిర్వహిస్తున్నట్లయితే వీటి నిర్వహణలో మీరు పొందే అనుభూతులను తెలియజేయవలసిందిగా కోరుచున్నారు. ఆరోగ్యకాంతులు వెదజల్లడంలో మీకు, మీ హెల్త్ బోర్డుకు విజయాన్ని కాంక్షిస్తున్నారు. హెల్త్‌బోర్డు నిర్వహించదలచినవారు శ్రీ రామయోగయ్య గారి క్రింది చిరునామాపై సంప్రదించగలరు :

**డా. అరవీటి రామయోగయ్య గారు**
**ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషియల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్,**
**6–101, న్యూమల్లార్, సహారా స్టేట్స్, మన్సూరాబాద్,**
**ఎల్.బి.నగర్, హైదరాబాద్ – 500 068.**
**సెల్ ఫోన్ : 98496 69282.**